


జన రాజకీయం కోసం... ₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 09
మే 1-15, 2018



## సోషల్ మీడియాలో బహిరంగ చర్చ ప్రమాణాల్ని పెంచండి





## 'హోదా' పై అవగాహన పెంచే ప్రయత్నమేదీ?

## మూడో దశ ఫెడరలిజం కావాలిప్పుడు!




## వ్యవస్థల నిర్మాణమే భరత జాతికి నిజమైన రక్ష



# భావితరాలకు ఆదర్శం జానకిరామయ్య జీవితం

సహకార పాలసంఘాలపై ప్రభుత్వ అనుచిత పెత్తనం వల్ల సరైన ప్రగతిని సాధించలేకపోతున్నాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సహకార రంగంలో తనకు స్ఫూర్తినిచ్చింది కరీంనగర్ జిల్లా అని గుర్తుచేసుకున్నారు. సహకార సంఘాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, పరిష్కారం చూపాలని ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తనకు సూచించారని, ప్రభుత్వ అజమాయిషీ తగ్గిస్తే సహకారం రంగం వృద్ధిని సాధిస్తుందని వివరించిన మీదట... 1995లో 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘ) చట్టాన్ని ఎన్టీఆర్ తీసుకొచ్చారన్నారు. అప్పటి నుంచీ తనకు మండవ జానకిరామయ్య గారితో పరిచయం ఉందన్నారు. పాల రైతుల సంక్షేమానికి, డెయిరీ అభివృద్ధికి ఆయన ఎంతో కష్టపడ్డారని అన్నారు. 25 ఏళ్లపాటు శ్రమించి డెయిరీని కష్టాల్లో నుంచి గట్టెక్కించారన్నారు. ఆయన సేవలు యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ జానకిరామయ్య జన్మదినోత్సవం సందర్భంగా ఆయన జీవితచరిత్రపై రాసిన పుస్తకాన్ని విజయవాడలోని పాలఫ్యాక్టరీలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జేపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమూల్ కురియన్, ముల్కనూర్ విశ్వనాథరెడ్డి, జానకిరామయ్య వంటి పెద్దలతో కలిసి పనిచేసిన స్ఫూర్తితోనే తాను జాతీయస్థాయిలో కూడా 97వ రాజ్యాంగ సవరణను సాధించానని, దీంతో సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి ఈ దేశంలో తిరుగులేని భరోసా లభించిందని జేపీ వివరించారు. ఎవరో వచ్చి మన బతుకుల్ని బాగుచేయరని, మన బతుకుల్ని బాగు చేసుకునే అవకాశాలు మన చేతుల్లోనే ఉన్నాయని మనం గుర్తుంచుకుంటేనే మార్పు సాధ్యమన్నారు. సహకార రంగాన్ని మండవ ఎలా బతికించారో, అలాగే ప్రజలు మిగిలిన రంగాల్ని కూడా బాగుచేసుకోవాలన్నారు. రైతులకు పాల ద్వారా కొంత ఆదాయం వస్తోందని, కానీ ప్రభుత్వాల విధానాలు మారితే, ఎగుమతులు-దిగుమతుల సుంకాల్ని సరిచేస్తే పంటల ద్వారా కూడా మెరుగైన ఆదాయం లభిస్తుందని జేపీ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు, పుస్తక రచయిత కపర్థి (సత్యనారాయణబాబు), కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ రాజేశ్వరరావు, శాస్త్రవేత్త వెంకట సుబ్రహ్మణ్యం, విశాఖ డెయిరీ ఎండీ ఎస్వీ రమణ, ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన, మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర, స్వచ్ఛాంధ్ర మిషన్ వైస్ ఛైర్మన్ సీఎల్ వెంకట్రావు, మోడల్ డెయిరీ ఛైర్మన్ ధనవర్ధనరావు, కార్పొరేటర్ గుర్రం కనకదుర్గ, కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ బాబూరావు, డైరెక్టర్ చలసాని ఆంజనేయులు, రైతు సంఘాల నాయకులు, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

మే 1-15, 2018 సంపుటి - 9 సంచిక - 09

కార్టూన్ కార్నర్



డబ్బులిచ్చి ఛస్తేగా.. నాలుగు కాకపోతే నలభై రోజులు తీసుకోమను..!

## లోపలి పేజీల్లో...

హోదా, ఇతర విభజన హామీలపై కలిసి........... 5
ఫెడరల్ ఫ్రంట్ ప్రభుత్వం... ఊరించే ఊహ,...... 6
ఆరోగ్యకరమైన పార్టీ అవసరమే.................... 10
బడులను బాగు చేసుకోవడానికి ఫెడరలిజం.... 12
భారతదేశ శక్తిసామర్థ్యాలను వెలికితీసేందుకు... 15
సెంటిమెంట్‌ని రగల్చటం తప్పు... 'హోదా'పై...... 18
విభజన హామీల అమలు కోసం లోక్‌సత్తా ఏపీ.. 20
ఆర్థిక నియంత్రణ, పర్యవేక్షణ అస్తవ్యస్తం.......... 21
అమర్యాదలో భావసారూప్యం.................... 27
పౌరసేవల హక్కు చట్టం తేవాలి.................. 29
ఆత్మన్యూనతతో ఆలోచించొద్దు, మొల్ల లాంటి. 30
ఇంకా నిర్లక్ష్యం చేసే ప్రభుత్వాసుపత్రుల్లో.......... 31
వ్యవస్థల నిర్మాణమే భరత జాతికి నిజమైన రక్ష... 33

### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

### చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |


- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల నిరోధక చట్టం



ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల నిరోధక చట్టంపై సుప్రీంకోర్టు ఆదేశాలు, దానిపై దళిత సంఘాల ఆందోళనలు, ప్రభుత్వం, ప్రాచుర్య పార్టీల స్పందన, తదనంతర పరిణామాలు సమస్యను యధాతథంగా కొనసాగించటానికే దోహదం చేయడం దురదృష్టకరం! ఎస్.సి, ఎస్.టిల రక్షణకు చట్టపరంగా ప్రత్యేక ఏర్పాటు ఉండాలనటంలో మరోమాటకు ఆస్కారం లేదు. దాంతోపాటు, ఆ చట్టం దుర్వినియోగమై అమాయకులు నలిగిపోకుండా తగిన రక్షణలు కూడా పకడ్బందీగా ఉండాలి. ఎస్.సి, ఎస్.టిలు సహా అందరూ అంగీకరించే వాదన ఇది! కానీ విచిత్రంగా అందరూ అంగీకరించే ఈ న్యాయసూత్రాన్ని అమలు చేయటం చేతకావడం లేదు. వాస్తవమూ, దాని చుట్టూ పరిష్కారాలూ గురించి ఆలోచించకుండా .. ఏవో మాట్లు వేసి లేదా కొంత హడావుడి తర్వాత యధాతథస్థితిని కొనసాగించి అన్ని వర్గాలనూ సంతృప్తిపరచాలని చూస్తే, పార్టీలకు ఓట్లు, కొందరికి వ్యక్తిగత లబ్ధి తప్ప చట్టం లక్ష్యం ఎప్పటికీ నెరవేరదు. చట్టం వచ్చిన గత 30 ఏళ్లుగా ఉన్నట్లే వచ్చే ముప్పయి ఏళ్లూ మొక్కుబడిగా గడచిపోతాయి. ఎస్.సి, ఎస్.టి చట్టం దుర్వినియోగమవుతోందనటానికి సుప్రీంకోర్టు చూపిన సాక్ష్యాధారాల్లో ప్రధానమైనది- కేసులు వీగిపోవటం! చట్టాన్ని సంస్కరించాలీ అని కోర్టు భావించినప్పుడు.. వీగిపోయిన కేసులు తప్పుడు కేసులా, ఈ ఒక్క చట్టం విషయంలోనే ఇలా కేసులు వీగిపోతున్నాయా అని ఇంకొంత పరిశీలన చేసి ఉండాల్సింది. కిందిస్థాయి పోలీసు సరిగా పనిచేయటంలేదు కాబట్టి, పైస్థాయి అధికారి జోక్యానికి ఆదేశించటం ఎస్.సి, ఎస్.టిల్లోని అభద్రతను మరింత పెంచింది. ఎస్.సి, ఎస్.టి చట్టం విషయంలోనే కాదు, ఐపీసీ కేసుల్లోనూ పోలీసులు చితక్కొట్టో, ప్రలోభపెట్టో ఒప్పించకుండా శిక్షలు పడుతున్న కేసులు భారతదేశంలో నూటికి కేవలం ఆరు మాత్రమే. అంటే, ఒకరకంగా న్యాయం అందకపోవటం అనే సమస్య ఈ దేశంలో 80-90 శాతంగా ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలందరిదీ! వారిలోనూ తీవ్ర వివక్షకు గురవుతున్న ఎస్.సి, ఎస్.టిలు, మహిళలకు న్యాయం చేయటానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక చట్టాలు సమర్థవంతంగా పనిచేయాలంటే.. ముందు ఈ చట్టబద్ధపాలన సక్రమంగా అమలయ్యేలా చేయాలి. పోలీస్ స్టేషన్‌కి వెళితే ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయటానికి, గౌరవప్రదమైన స్పందనను సకాలంలో పొందడానికి 'పౌర సేవల' చట్టం వంటి ఏర్పాట్లు ఉండాలి. దర్యాప్తులో రాజకీయ జోక్యం లేకుండా ఆ విభాగంలోని పోలీసులకు జవాబుదారీతనమున్న స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించాలి. అధునాత ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రతి జిల్లాలో, స్వతంత్ర ప్రాసిక్యూషన్, స్థానిక న్యాయస్థానాల ఏర్పాటు వంటి చర్యల్ని అమలు చేయాలి. ఇవన్నీ తేలిగ్గా తేగలిగినవి. ఈ ఏర్పాట్లు చేస్తే.. ఎస్.సి, ఎస్.టిల మీద నేరాలలో అత్యధిక శాతం కేసుల్లో శిక్షలు పడి లక్ష్యం నెరవేరుతుంది. అమాయకులు అరెస్టు భయంతో అండర్‌గ్రౌండ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితులుండవు. క్రమంగా నేరాలు కూడా తగ్గుముఖం పడతాయి. ఇవే ఏర్పాట్లతో కథువా, ఉన్నావ్‌లో అమాయక బాలికలపై అత్యాచారాలు వంటి కేసుల్లో కూడా దోషుల్ని శిక్షించవచ్చు, దారుణాల్ని నిరోధించవచ్చు కానీ.. మొత్తంగా చూస్తే మాత్రం బాలికలు, మహిళలపై అత్యాచారాల పటిష్ట నిరోధానికి కొన్ని అదనపు ఏర్పాట్లు కావాలి. చట్టబద్ధపాలన మెరుగ్గా ఉన్న దేశాల్లో కూడా మహిళల మీద నేరాలు ఎక్కువగా, శిక్షలు తక్కువగానే ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. కానీ ఆ దేశాల్లో లేని కుటుంబ వ్యవస్థ మనకున్న అదనపు బలం! కుటుంబం యూనిట్‌గా ఉన్న సామాజిక వ్యవస్థ.. కులపరమైన అంశాల్లో ప్రతికూల ఫలితాలనివ్వొచ్చుగానీ, మహిళల రక్షణకు సంబంధించిన విషయంలో మాత్రం మెరుగైన ఫలితాల్నే ఇస్తుంది. మన సమాజంలోని మంచిని ఉపయోగించటం ద్వారా మితిమీరిన ప్రవర్తనల్ని కట్టడి చేస్తూ బాలికలు, మహిళలపై దాడులను నివారించవచ్చు, దోషులకు తగిన శిక్షలు పడేలా విచారణ ప్రక్రియను కూడా బలోపేతం చేయవచ్చు. ప్రధాని నరేంద్రమోదీ పార్టీ ఎన్నికల సమీకరణల్లో చిన్న కులాలను సమీకరించటం, దళితుల్ని గుత్త ఓటుబ్యాంకుగా నిలబెట్టుకోవటం కీలకం కాబట్టి- కృత్రిమ హడావుడితో కోర్టులో కాస్త ఘాటైన రివ్యూ పిటిషన్‌ని దాఖలు చేసి ఉండొచ్చు, బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి రోజు నుంచి గ్రామాల్లోని దళితుల ఇళ్ల వద్ద నిద్రలు, నడకలు చేసి ఉండవచ్చు, చట్టాన్ని తిరిగి యధాతథంగా ఉంచుతూ ఆర్డినెన్స్‌ని తెచ్చి ఆందోళనలను చల్లబరచవచ్చు.. కానీ చట్టబద్ధపాలనను సక్రమంగా అమలుచేయకుండా, తప్పు చేస్తే శిక్షపడుతుందన్న భరోసాను కల్పించకుండా, పోలీస్ స్టేషన్లలో తమ ఫిర్యాదుకు గౌరవప్రదమైన, న్యాయమైన స్పందన ఉంటుందన్న విశ్వాసం కల్పించకుండా.. అవన్నీ కంటితుడుపు చర్యలే అవుతాయి. అలాగే, సుప్రీంకోర్టు తీర్పు పట్ల దళితుల్లో అంత ఆగ్రహం, అంత నిరసన కేవలం చట్టంలో చేసిన మార్పుల వల్ల రాలేదని గుర్తించాలి. సమాజంలో ఇంకా కొనసాగుతున్న వివక్ష, అత్యాచారాల నిరోధక చట్టం ఉన్నా దొరకని భద్రత, దాన్ని సరిచేయలేని ప్రభుత్వ విధానాలు, గోరక్షకుల దాడులు వంటి వాటి పట్ల ఉదాసీనత, అన్నిటినీ మించి సరైన ఉద్యోగావకాశాల్ని అందివ్వలేని పాలకుల అసమర్థత పట్ల ఉన్న అసంతృప్తి, తిరస్కారం.. సాంకేతికత ఆసరాతో ఇవన్నీ చట్ట సవరణలపై ఆందోళనల రూపంలో ఒక్కసారిగా పెల్లుబికాయి. ఇప్పుడు చట్టం చుట్టూ వున్న సమస్యల్ని దాటవేస్తే, ఆందోళనల వెనకున్న ఇంకొన్ని లోతైన అంశాల్ని పట్టించుకోకుంటే.. అందుకు మూల్యాన్ని మళ్లీ ఏదోకరూపంలో చెల్లించాల్సి వస్తుంది. అలాగే, దళితులు, గిరిజనులు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయమిది! గత 30 ఏళ్లుగా ఈ చట్టం ఎందుకు నామమాత్రంగా అమలవుతోంది? ఎందుకు సుప్రీంకోర్టులో అలాంటి ఫిర్యాదులు, సాక్ష్యాధారాలు సమర్పితమయ్యాయి, కోర్టు ముందు వినిపించిన వాదనల్లోని లోపాలేమిటి, వివక్ష తొలగింపునకు శాశ్వత పరిష్కారాలేమిటి అని ఓ అంబేద్కర్‌లా ఆలోచించి ఎందుకు స్పందించలేకపోతున్నామో, పాత రాజకీయ పంథాలో రోడ్డెక్కి హింసాత్మక ఆందోళనలకు దిగుతూ కొన్ని రాజకీయ శక్తులకు పావులుగా ఎందుకు మారుతున్నామో అణగారిన వర్గాలు సమీక్షించుకోవాలి. చట్టబద్ధపాలన, పౌర సేవల చట్టం, వివక్షల్ని శాశ్వతంగా తొలగించే నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధిని తమ డిమాండ్లుగా చేసుకుని రాజకీయం చేయాలి (ఈ ఎజెండా కోసమే కృషి చేస్తోంది కాబట్టే.. లోక్‌సత్తా వల్ల సంపన్నులకన్నా దళితులు, పేదలు, మధ్యతరగతివారికే ఎక్కువ లాభమని తరచూ చెప్పే విషయాన్ని మరోసారి గుర్తుచేస్తున్నాను). ఏదోకస్థాయిలో తమలాగే బాధితులుగా ఉన్న మహిళలు, ఇతర అణగారిన వర్గాలు, పేదలు, దిగువ మధ్యతరగతి వారిని కూడా ఈ పోరాటంలో కలుపుకోవాలి.



# హోదా, ఇతర విభజన హామీలపై కలిసి పోరాడాలి, దేశం, రాష్ట్రం కంటే ఎవరూ గొప్ప కాదు: జేపీ



విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలు, ఆంధ్రప్రదేశ్ ఇతర ప్రయోజనాల కోసం అన్ని పార్టీలూ కలిసి పోరాడాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి కేంద్రానికి మధ్య జరుగుతున్న పోరాటం రాజకీయ పార్టీలది కాదన్నారు. 2019 ఎన్నికలను అడ్డంపెట్టుకుని అధికార, ప్రతిపక్షాలు ఎడమొగం, పెడమొగంగా ఉంటే తెలుగు ప్రజలు నష్టపోతారనే విషయం మర్చిపోకూడదన్నారు. పార్టీలు, కులాలు, వర్గాలు, మతాలు, జెండాలు పక్కనపెట్టి పోరాటం చేయాలన్నారు. ఈ సమయంలో పక్షపాత రాజకీయ ప్రయోజనాల కోసం ప్రయత్నించటం తగదన్నారు. అందరినీ కలుపుకుని రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిపై ఉందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీల అమలుపై జేపీ విజయవాడ ఐఎంఏ హాలులో మీడియాతో మాట్లాడారు.

తెలుగునాట విచిత్రమైన పరిస్థితి నెలకొందని, దేశం గురించి మాట్లాడితే బీజేపీ మద్దతుదారులు అంటున్నారని, రాష్ట్రం గురించి మాట్లాడితే తెలుగుదేశం పార్టీకి సానుభూతిపరులనే ముద్ర వేస్తున్నారని జేపీ అన్నారు. దేశం, రాష్ట్రం కంటే ఏ వ్యక్తీ గొప్పవారు కారన్నారు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి.. తాము ఏదోక పార్టీకి కాకుండా ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహిస్తున్నామని గుర్తించి పనిచేయాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కులాలు, వర్గాలవారీగా విడిపోవడంతో అధికారదాహం ఎక్కువైందన్నారు. ప్రస్తుతం తెలుగు రాజకీయనేతలను మేధోదారిద్ర్యం వెంటాడుతోందన్నారు. అహంకారం, మూర్ఖత్వంతో తెలుగువారు తీవ్రంగా నష్టపోయే ధోరణులు కనిపిస్తున్నాయని హెచ్చరించారు. ఇలాంటి రాజకీయంలో ఎవరు అధికారంలోకి వచ్చినా జనం జీవితాల్లో మార్పు ఉండదని, ప్రజలే బలిపశువులు అవుతారని అన్నారు. సమైక్యాంధ్ర కోసం ప్రాణాలు అర్పిస్తామన్నా విభజన ఆగిపోయిందా అని ప్రశ్నించారు. పెత్తనం కోసం రాజకీయ పార్టీలు పోట్లాడుకుంటూ రాష్ట్ర పరువును బజారున పెడుతున్నాయన్నారు. మీడియాలో కూడా రాష్ట్ర ప్రయోజనాల కంటే గొడవలు సృష్టించే అంశాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్ర విభజన అనివార్యమని తెలిసిన వెంటనే హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే ఆంధ్రప్రదేశ్‌కు జరిగే నష్టాన్ని పూడ్చాలని అడిగిన మొదటి వ్యక్తిని తానేనని జేపీ స్పష్టంచేశారు. విడిపోతే మిగిలిన ఏపీకి ఎంత ఆర్థిక లోటు ఏర్పడుతుందో లెక్కలు బైటపెట్టి పరిష్కారాన్ని సూచించానన్నారు. వాటిలో కొన్ని మాత్రమే అమలయ్యాయని, కీలకమైనవి ఇంకా అమలవ్వాల్సి ఉందని అన్నారు. రాష్ట్రానికి చట్టబద్ధంగా రావాల్సిన నిధులు, హక్కులను నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. ఏపీకి రావాల్సిన నిధులను ఆలస్యంగా ఇస్తే ప్రయోజనం ఉండదన్నారు.


రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తే అభివృద్ధి, పన్నుల్లో రాయితీలు వస్తాయని జేపీ అన్నారు. కేంద్రం నుంచి రూ.70,000 కోట్లు రాబట్టుకోవాల్సిన బాధ్యత అన్ని పార్టీలు, ప్రజల మీద ఉందన్నారు. పార్టీలకు మద్దతు, ఎవరికి ఓటు వేయాలి అనేది ఎన్నికలప్పుడు చూసుకోవాలని.. ఫెడరల్ స్ఫూర్తితో కేంద్రం నుంచి రాష్ట్రానికి ప్రయోజనాలను సాధించుకోవాల్సిన కీలక సమయంలో పార్టీల పేరుతో కొట్లాడుకుంటే నష్టపోయేది ప్రజలేనని అన్నారు. స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేసేలా జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేయటాన్ని జేపీ తప్పుపట్టారు. ప్రతిపక్షాలను దెబ్బతీసేందుకు ఇలాంటి అప్రజాస్వామిక, రాజ్యాంగవిరుద్ధ ధోరణులు తగవన్నారు. అనవసర విమర్శలకు ఆస్కారం లేకుండా.. రాష్ట్రేతర ఆర్థిక నిపుణుల కమిటీతో అధ్యయనం చేయించి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నివేదికను తయారు చేయిస్తున్నామన్నారు.

సమావేశంలో లోక్‌సత్తా నాయకులు డా॥ పట్టాభిరామయ్య, మాలతి తదితరులు పాల్గొన్నారు.

# ఫెడరల్ ఫ్రంట్ ప్రభుత్వం.. ఊరించే ఊహ, 'ఫెడరలిజం విస్తరణ' మాత్రం అరచేతిలోని అవకాశం!

జాతీయస్థాయి ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు మరింత స్వయంప్రతిపత్తి కావాలనే డిమాండ్ మరోసారి ఊపందుకుంటోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి, ప్రధానంగా ప్రాంతీయపార్టీల నుంచి ఈ ఫెడరలిజం గళం గట్టిగా మొదలైంది. రాష్ట్రాల అవసరాల పట్ల ఎన్నికల కోణంలో తప్ప పాలనా కోణంలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం స్పందిస్తున్న దాఖలాలు తగ్గిపోతుండటంతో.. ప్రాంతీయ పార్టీలు, రాజకీయ చైతన్యం పాలు ఎక్కువగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నాయి, కేంద్ర పెత్తనాన్ని ప్రశ్నిస్తున్నాయి.

శక్తిమంతమైన నాయకురాలు జయలలిత మరణించటం, రాజకీయ కురువృద్ధుడు కరుణానిధి శారీరకంగా అశక్తుడు కావటంతో రాష్ట్రంలో పాగా వేసేందుకు బీజేపీ చేసిన రాజకీయం పట్ల ప్రజల్లో చెలరేగిన వ్యతిరేకత, రాజకీయ శూన్యాన్ని భర్తీ చేసేందుకు ప్రముఖ సినీహీరోలు కమల్‌హాసన్, రజనీకాంత్ రంగప్రవేశం చేయటం వల్ల తమిళనాడులో ఈ ధోరణి కనిపిస్తుండగా.. ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి ఎన్నికల్లో నెగ్గేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాష్ట్రానికి సొంత జెండాను ఏర్పాటు చేయటం, కేంద్రాన్ని ధిక్కరిస్తూ పలు అంశాల్లో స్వతంత్రతను డిమాండ్ చేయటం వల్ల కర్ణాటకలో ఫెడరలిజం విస్తరణ డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి. కమల్ హాసన్ స్థాపించిన 'మక్కల్ నీది మయ్యమ్' పార్టీ జెండాలో ఆరు దక్షిణాది రాష్ట్రాలను (పుదుచ్చేరి సహా)




కలిపిన గుర్తును పొందుపరిచారు. దక్షిణ భారతదేశమంతా కలిపి 'ద్రవిడనాడు'గా ఏర్పడితే అభ్యంతరమేమీ లేదని డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ వ్యాఖ్యానించారు.

ఇదేసమయంలో ప్రత్యేకహోదా, విభజన హామీల అమలుకు సంబంధించి కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరించటం పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఫెడరలిజం దిశగా మళ్లించేందుకు ముఖ్యమంత్రి, తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారు.

బీజేపీతో ఎదుర్కొంటున్న సమస్యలకు తోడు.. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ హడావుడి అమలు వల్ల తలెత్తిన సమస్యలు, రానున్న 15వ ఆర్థిక సంఘం నిధుల్లో జనాభా ప్రాతిపదికన తమకు నిధులు తగ్గే అవకాశం ఉండటంతో కేరళ కూడా దక్షిణాది ఐక్యతను బలపరుస్తోంది.

2014 ఎన్నికల్లో కలిసి పోటీచేసిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేతో నాలుగేళ్లపాటు కలిసున్నాక నాటకీయంగా 2018లో చంద్రబాబు తెగతెంపులు చేసుకోవటానికి కాస్త ముందే.. తెలంగాణ ముఖ్యమంత్రి, తెరాస అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు బీజేపీయేతర, కాంగ్రెసేతర ఫెడరల్/ పీపుల్స్ ఫ్రంట్ జాతీయస్థాయిలో ఏర్పడాలని, ఇందుకు తానే చొరవ తీసుకుంటానని ప్రకటించారు. ఇలా రాష్ట్రాలకు మరిన్ని అధికారాల కోసం దక్షిణాది రాష్ట్రాలన్నీ కలసికట్టుగా వ్యవహరించాలన్న ధోరణి బలపడుతోంది.

దేశానికి స్వతంత్రం వచ్చి 70 ఏళ్లు దాటినా పేదరికం పోలేదని, రైతుల ఆత్మహత్యలు ఆగలేదని, అనేక రంగాల్లో భ్రష్టుపట్టించారని, ఇది ముమ్మాటికీ దేశాన్ని 64 ఏళ్లపాటు పరిపాలించిన కాంగ్రెస్, బీజేపీల వైఫల్యమేనని ఫ్రంట్ ఆలోచనని ప్రకటించే సమయంలో కేసీఆర్ అన్నారు. చైనా, జపాన్‌లు 25 ఏళ్లలోనే అభివృద్ధిని సాధిస్తే.. మనదేశంలో బతుకులు ఇంకా దయనీయ స్థితిలోనే ఉన్నాయన్నారు. "70 సంవత్సరాల ప్రయాణం తర్వాత దేశం ఎటుపోతోంది? దేశంలో నెలకొన్న పరిస్థితులు ఏంటి? అని ఆలోచిస్తే నాకే ఆశ్చర్యంగా ఉంది. అమెరికాలో అలా ఉంటుంది, జర్మనీ ఇలా ఉంటుందని ఎన్నాళ్లు చెప్పుకుందాం. జర్మనీవాడు బంగారం తింటున్నడా? అమెరికావాడు వెండి

తింటున్నడా? మనం ఏమన్నా మట్టి తింటున్నామా? దేశాన్ని ఎన్ని విధాలుగా విభజిస్తారు. దేశం అంటే ప్రజలు.. ఏ కులం అయితే ఏంటి? అందరూ బాగుండాలి. రాజకీయంగా ఆటలాడు తున్నారే తప్ప వాస్తవ దృక్పథంతో ఎవరూ పనిచేయడం లేదు'' అని తెలంగాణ ముఖ్యమంత్రి వాపోయారు. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చే క్రమంలో జాతీయస్థాయిలో కొత్తకూటమి ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

తమది ప్రజాఫ్రంట్ అనో, మొదటి ప్రత్యామ్నాయమనో కేసీఆర్ చెబుతున్నప్ప టికీ, ఫెడరలిజాన్ని విస్తరించటమే ఆ ఫ్రంట్‌కు పునాది. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలున్న బలమైన సమాఖ్య వ్యవస్థ చుట్టూనే కేసీఆర్ ఫ్రంట్ ఆలోచన అల్లుకుని ఉన్నది.

ఇలా మూడో దశ ఫెడరలిజం రావాలని, 'మూడో దశ ఫెడరలిజం – మూడో అంచె బలమైన స్థానిక ప్రభుత్వాలు' నూతన భారతదేశ నిర్మాణానికి కీలకమని ఎన్నో ఏళ్లుగా లోక్‌సత్తా చెబుతూ వస్తోంది. 2016లో లోక్‌సత్తా మలిదశ ఉద్యమం (లోక్‌సత్తా 2.0)ను ప్రకటిస్తూ ఆవిష్క రించిన చర్చాపత్రంలో కూడా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఈ అంశాన్ని ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా ప్రతిపాదించారు. జాతీయ సమగ్రత, రాజ్యాంగ మౌలిక లక్ష్యాలకు కట్టుబడి రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి, సొంత రాజ్యాంగం ఉండాలని, పంచాయతీలో ఎలా ఎన్నికలు జరగాలో జాతీయస్థాయి రాజ్యాంగంలో చెప్పటంలో అర్థం లేదని జేపీ స్పష్టం చేశారు. 1980వ దశకంలో ఎన్టీరామారావు, కరుణానిధి, బిజూపట్నాయక్, రామకృష్ణహెగ్డే, జోతిబసు, ఫరూక్ అబ్దుల్లా లాంటి వారంతా కలిసి కేంద్రంపై చేసిన పోరాటం వల్లే మనదేశంలో ఫెడరలిజం బలపడి రెండో దశ మార్పులు చోటు చేసుకున్నా యని, ఈవేళ కేంద్రం నుంచి రాష్ట్రాలకు బడ్జెట్‌లో 50శాతానికిపైగా నిధులు వస్తున్నాయంటే, ఆనాటి పోరాట ఫలితమేనని జేపీ ఆ చర్చాపత్రంలో వివరించారు. అయితే ఇంకా అనేక అంశాలు అపరిష్కృతంగా ఉన్నందున 'మూడో దశ ఫెడరలిజం.. అందులో భాగంగా మూడో అంచె ప్రభుత్వం' కోసం రాష్ట్రాలన్నీ కలిసి ప్రయత్నించాలని కోరుతున్నారు. పార్టీలకతీతంగా చేస్తున్న సురాజ్య యాత్రలో కూడా ఈ అంశాల్ని జేపీ ప్రస్తావిస్తున్నారు. ఇప్పుడు కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదన.. బీజేపీ ఎన్నికల రాజకీయం దెబ్బకి ఎన్డీయే కూటమి లోపల, బైట విలవిలలాడుతున్న కొన్ని ఉత్తరాది ప్రాంతీయ పార్టీలకు కూడా ఒక అవకాశంగా కనిపిస్తోంది. ఇలా మొత్తంగా ఫెడరలిజం పరిణతికి అనుకూల పరిస్థితులు ఏర్పడినట్టు కనిపిస్తున్నా.. అందులో వైరుధ్యాలు కూడా బలంగా ఉన్నాయని గుర్తించాలి.

కేసీఆర్, చంద్రబాబు నాయుడుల్నే తీసుకుంటే.. ఫెడరలిజం కంటే తక్షణ ఎన్నికల, వ్యక్తిగత ప్రయోజనాల కోణంలోనే ఫెడరలిజం వాదనను ఎత్తుకున్నారనటానికి సంకేతాలు స్పష్టంగా ఉన్నాయి. తన కుమారుడు కె.తారక రామారావును ముఖ్యమంత్రిని చేయటానికే కేసీఆర్ ఈ ఎత్తుగడ వేశారని, చంద్రబాబు నాయుడు మూడో ఫ్రంట్‌ను మొదలెట్టక ముందే కేసీఆర్ చేత మోదీయే కర్చీఫ్ వేయించారని వస్తున్న వార్తలు నిరాధార మని తోసిపుచ్చలేం. ఫెడరల్ వాదాన్ని బలంగా వినిపిస్తున్న సిద్ధరామయ్యకు కూడా ఎన్నికలప్పుడే రాష్ట్రాల అధికారాలు, దాని వల్ల పాలనాపరంగా లాభాలు గుర్తుకొచ్చాయి. చంద్రబాబు సైతం విధిలేని పరిస్థితుల్లోనే ఆంధ్రుల ఆత్మగౌరవం నినాదాన్ని మళ్లీ నిద్రలేపే ప్రయత్నం చేస్తున్నారు.

అలాగే మూడో ఫ్రంట్ అధికారంలోకి వచ్చి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండియాలాగా ఫెడరల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఓ భిన్నమైన ఎజెండాను అమలు చేసే ప్రయత్నం సఫలమయ్యే అవకాశం ఇప్పటికైతే కన్పించటం లేదు. బీజేపీ, కాంగ్రెస్‌లతో పోటీపడుతూ ప్రాంతీయ పార్టీలు, స్వతంత్రులు సాధిస్తున్న ఓట్లు 50శాతం దాకా ఉన్నాయన్న విషయం వాస్తవమే. 2009 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ల ఉమ్మడి ఓట్లు 47.4శాతం, అదే ప్రాంతీయపార్టీలు, స్వతంత్రులది 52.6శాతం. 2014లో ఆ శాతాలు 50.8, 49.2గా ఉన్నాయి. కానీ ఇంతశాతం ఓట్లున్నా పరస్పర విరుద్ధ ప్రయోజనాలున్న ప్రాంతీయ పార్టీలు న్నందున ఎంత గొప్పగా వచ్చినా.. కాంగ్రెసేతర, బీజేపీయేతర ఫెడరల్ ఫ్రంట్‌కు 150కి మించి సీట్లు వచ్చే అవకాశంలేదని విశ్లేషకుల అంచనా. ఏదోక జాతీయపార్టీ మద్దతు లేకుండా ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం లేదు. ఒకవేళ ఏదైనా అద్భుతం జరిగి అధికారంలోకి వచ్చినా.. ఈ ఫ్రంట్‌కున్న భిన్నమైన ఎజెండా ఏమిటి? గుణాత్మక మార్పును తెచ్చే విధానాలేమిటి? – అంటే సందేహాస్పదమే.

ఇన్ని లోపాలు, అవరోధాలు ఉన్నా కూడా.. ఫెడరలిజం విస్తరణకు ప్రస్తుత వాతావరణాన్ని ఓ సదవకాశంగానే మనం భావించాలి.

ఫ్రంట్ ఏర్పాటులో ముందున్నది కేసీఆర్ కాబట్టి, ఆయన ప్రయత్నం చుట్టూ ప్రస్తుతం ఎక్కువ చర్చ అవసరం. ప్రత్యామ్నాయ పాలనలో భాగమంటూ కేసీఆర్ ప్రకటించినవే తీసుకుంటే.. సాగునీటి ప్రాజెక్టులు, రైతులకు ఎకరాకు రూ.8వేలు, షాదీముబారక్, రుణమాఫీ, కేసీఆర్ కిట్లు వగైరాలు జాబితా మొదటి వరుసలో ఉన్నాయి (ఫ్రంట్ ప్రధానంగా 'పరిపాలనా కార్యక్రమాల' అమలుకు సంబంధించిందని దేవెగౌడ వ్యాఖ్యా

నించారు కూడా). వీటిని జాతీయస్థాయికి తీసుకెళ్లటమే దేశానికి మరో దిశ అవుతుందంటున్నారు. ఇంకొన్నిటిపై మేధావులతో చర్చిస్తామన్నారు. అడపాదడపా కొంతమందిని కలుస్తున్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జీ, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, మాజీ ప్రధాని, జేడీ(ఎస్) జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ వంటి వారితో సమావేశాలు జరిపారు. కర్ణాటక అసెంబ్లీ తీర్పులో పల్స్‌ను చూశాక అవసరమైతే మార్పులుచేర్పులు చేసుకుని ఒడిషా ముఖ్యమంత్రిని, మిగిలినవారిని కలుస్తానంటున్నారు.

ఫ్రంట్ ఆలోచన వెనుక ఉన్న దార్శనికతలో భాగంగా.. పైన పేర్కొన్న పథకాలు మాత్రమే కాకుండా ఇంకొన్ని అంశాల్ని కేసీఆర్ ప్రస్తావించారు.

"ఢిల్లీలో పెత్తనం చేస్తూ చిల్లరమల్లరగా రాజకీయ లబ్ధి కోసం యత్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి దవాఖానాలు, మున్సిపల్ మోరీల వద్ద ఏం పని? వాళ్లు చేయాల్సిన పని వారు చేయరు. విదేశీ వ్యవస్థ, సైన్యం, జాతీయ రహదారుల మీద వారు పనిచేయాలి. ఈ రోజు అమెరికాలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో సుప్రీంకోర్టు ఉంటుంది. సిటీ కమిషనర్.. నగర మేయర్ కింద పనిచేస్తారు. ఎవరి జీడీపీ వారికి ఉంటుంది. రాష్ట్రాల మీద పెత్తనం ఉండదు. ఇక్కడ అలా చేయలేమా? నేను ఎంపీ అయ్యాక 12వ పంచవర్ష ప్రణాళిక అమలయితే వాటిని చదివా. వాస్తవానికి ఆ రోజుల్లో నేను ఇందిరాగాంధీకి పెద్ద అభిమానిని. భూ సంస్కరణల చట్టం తెచ్చి పేదలకు గుడిసెలు వేయించడం వంటి కొన్ని కార్యక్రమాలు అమలు చేస్తే ఆమె గొప్ప నాయకురాలని పొంగిపోయా. అయినా పెద్ద మార్పు జరగలేదు. ఆ తర్వాత రాజీవ్‌గాంధీ వచ్చారు. ఆయన మీదా బాగా ఆశపడ్డా. ఏమీ కాలేదు. మోదీ వచ్చాక చాలాసార్లు ఆయనతో మాట్లాడా. రైతులకు, గిరిజనులకు మేలు చేయాలని అడిగా. ఫసల్ బీమా యోజన తెచ్చామని చెప్పారు. అది కూడా బాగా లేదు. ప్రతి ఒక్కరి వద్ద ప్రీమియం తీసుకుంటారు. పంట పాడయితే మాత్రం డబ్బులు రావు. కేంద్రం ఏదీ తేల్చదు. ఏదీ తెగదు. ఏదీ జరగదు"! అని కేసీఆర్ అన్నారు.

కేసీఆర్ ఇప్పుడు ఒక పార్టీ అధ్యక్షుడు మాత్రమే కాదు. ఒక రాష్ట్రానికి సారథి. ఆయన దార్శనికతఃఏదైనా చేతల్లో 'చెప్పుకోదగిన' ఉదాహరణలతో కావాలి. ''ఆటగాళ్లు మారితే మార్పు రాదు, ఆటనియమాల్ని మార్చాలన్న" లోక్‌సత్తా వాదనను ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదనలో భాగంగా చక్కగా వివరిస్తున్న కేసీఆర్.. ఆటనియమాల్ని మార్చే ఎటువంటి విధానాలను తెలంగాణలో ఆచరించి చూపారు?

అమెరికాలాంటి చోట సిటీ కమిషనర్.. మేయర్ పర్యవేక్షణలో ఉంటారని కేసీఆర్ మెచ్చుకున్నారు. మరి తెలంగాణలో కమిషనర్‌ని, మేయర్‌ని ఉత్సవ విగ్రహాలుగా చేసి ముఖ్యమంత్రి, ఆయన కుమారుడే ఎందుకు నడిపిస్తున్నారు? నగరాలకు, పట్టణాలకు, పంచాయతీలకు ప్రభుత్వాల స్థాయి అధికారాలు, నిధులు ఏవి? గ్రామజ్యోతి పథకం కింద ఎందుకు రూపాయి కూడా అందివ్వలేకపోయారు? ఎన్నికల్లో పోల్గనేవాళ్ల నుంచి ప్రజలు ఏమీ ఆశించకుండా ఉండేందుకు, సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికల్లో పోటీచేసేందుకు వీలుగా ప్రభుత్వ కార్యాలయాలను ప్రక్షాళించి అక్కడ సేవలు జనాలకు సక్రమంగా అందే ఏర్పాట్లు చేయటం కీలకం. ఇందుకోసం పౌరసేవల చట్టాన్ని ఎందుకు తేలేకపోయారు? ఏళ్ల తరబడి ఎందుకు నానుస్తున్నారు? మహిళల భద్రతకు, పేదలకు చౌకగా, వేగంగా న్యాయం అందించటానికి 'స్థానిక న్యాయస్థానాల' చట్టాన్ని ఎందుకు అమలుచేయలేకపోతున్నారు? గురుకుల పాఠశాలల్లో కేవలం రూ.45,000కే మంచి విద్య.. హాస్టల్ వసతి, బట్టలతో సహా అందుతుంటే, మిగిలిన ప్రభుత్వ స్కూళ్లలో రూ.60,000 పైగా ఖర్చు చేస్తున్నా ఎందుకు రావటం లేదు? ఎందుకు తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య ఖర్చులు దేశంలోనే అత్యధికంగా కొనసాగుతున్నాయి? హైదరాబాద్‌లో కార్పొరేట్ వైద్యం కోసం తెలంగాణ ప్రజానీకం ఆస్తులనమ్ముకునే దుస్థితి ఇంకా ఎందుకు కొనసాగుతోంది?.. ఇవన్నీ కొన్ని కీలకరంగాలకు సంబంధించిన కొన్ని ప్రశ్నలు మాత్రమే. సాగునీరు అందించటం పేరుతో భారీ ఎత్తిపోతల పథకాలను ఏకపక్షంగా ఖరారు చేయటం, దళితులపై దాడులు, మౌలిక వసతులు అధ్వాన్నంగా ఉండటం, కార్పొరేటర్ల స్థాయి నుంచి ప్రజాప్రతినిధుల అవినీతి, ప్రభుత్వమే మత కార్యక్రమాలను స్పాన్సర్ చేయటం వంటి పలు ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి. వీటిలో చాలావరకు ఉన్న వ్యవస్థలోనే, తన పరిధిలోనే ఒక ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసి చూపించగలిగేవి.

ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా, తాత్కాలికంగా ప్రలోభపెట్టే అంశాల మీదే దృష్టి పెట్టి పనిచేస్తున్న ప్రభుత్వాల తరహాలోనే చాలామేర తెరాస ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోంది. వీటన్నిటినీ సరిదిద్దుకుని తెలంగాణను ఒక మోడల్ రాష్ట్రంగా రూపొందించి ఉంటే.. దేశంలో గుణాత్మక మార్పునకు ప్రతిపాదన చేసే అర్హత ఎవరూ ప్రశ్నించలేని స్థాయిలో మీకు వచ్చేది కేసీఆర్ గారూ! కానీ ఇవేవీ చేయకుండా జాతీయస్థాయిలో గుణాత్మక మార్పు తెస్తామంటే.. నమ్మశక్యంగా ఉండదు. తెలంగాణలో మీడియా కూడా చాలామేర కేసీఆర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ లోతైన చర్చ జోలికిపోకుండా

వదిలేస్తుండటంతో.. ఒకరకమైన ప్రమాదకర వాతావరణాన్ని కేసీఆరే స్వయంగా తన చుట్టూ సృష్టించుకున్నట్టయింది. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ వంటి వ్యక్తి నైతిక నాయకత్వంలో వచ్చినా ఓ పెద్ద ఉద్యమం, జనతా ప్రభుత్వం విఫలమవటానికి కారణం.. సరైన ఎజెండా లేకపోవటం అని మనం గుర్తించాలి.

కేసీఆర్‌గానీ, ఇంకొందరు ముఖ్యమంత్రులుగానీ ఈవేళ దేశంలో సరైన ప్రశ్నల్ని లేవనెత్తుతున్నారుగానీ.. నిర్దిష్టమైన పరిష్కారాల్ని చూపలేక పోతున్నారు. మోదీకి తానేమీ తక్కువ కాదన్నట్టు చంద్రబాబు పార్లమెంటు మెట్లకు మొక్కితే చాలదు (తనకు జాతీయ రాజకీయాల పట్ల ఆసక్తి లేదంటూనే చంద్రబాబు క్రమంగా ఢిల్లీలో చక్రం తిప్పే ప్రయత్నం చేస్తున్నారు). ఉట్టికెక్కలేనమ్మ.. సామెతను ముఖ్యమంత్రులు గుర్తుకు తెస్తున్నారు. తమ పరిధిలో ఉన్న అంశాలలో మార్పు తేవటం చేతగాని వారు.. జాతీయస్థాయిలో ఎలా తేగలుగుతారు? పైగా, ముఖ్యంగా దక్షిణాదిన.. రాష్ట్రాల మధ్య, ఒకే రాష్ట్రంలో వివిధ పార్టీల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకోవటంలో బీజేపీ, కాంగ్రెస్‌లు ఆరితేరాయి. ఏపీ ఏమైనా డిమాండ్ చేస్తే, తెలంగాణ ద్వారా ఆపుతారు. అలాగే తెలంగాణ ప్రయోజనాలకు ఏపీ ద్వారా అడ్డంకొడుతారు. ముఖ్యమంత్రి దూకుడుకు ఏదోక ప్రతిపక్ష పార్టీతో అవరోధాలను సృష్టిస్తారు. దీనికితోడు, కలగూరగంపలో భాగమయ్యే ప్రాంతీయపార్టీల అవకాశవాద రాజకీయాలు! వీటన్నిటినీ అధిగమించే పరిణతిని ప్రదర్శిస్తూ.. దేశమంతా గుణాత్మక మార్పును తెచ్చే స్పష్టమైన ఎజెండాను ముఖ్యమంత్రులు సిద్ధం చేసుకోవాలి. హేతుబద్ధంగా, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే, మున్ముందు కూడా వ్యక్తుల వల్ల దెబ్బతినకుండా ఉండేలా వ్యవస్థల్ని నిర్మించే నూతన విధానాల్ని ప్రకటించాలి. తప్పిదాల్ని దిద్దుకుని.. వాళ్ల పరిధిలో ఆచరించి చూపుతూ ఈ విషయాల్ని చాటగలగాలి. దీనివల్ల ఎవరి ద్వారానైనా ఫెడరల్ ఫ్రంటో లేదా మరో పేరుతోనో ప్రత్యామ్నాయం బలమైన, విశ్వసనీయమైన వేదికగా రూపుదిద్దుకుంటుంది. రానున్న ఎన్నికల్లో జాతీయ స్థాయిలో అధికారంలోకి రాకపోయినా.. ఫెడరలిజం విస్తరణ దిశగా గణనీయ ఫలితాల్ని సాధించగలుగుతుంది. తద్వారా చెప్పుకోదగిన మార్పుల్ని ముఖ్యమంత్రులు రాష్ట్రాల్లో ఆచరణలో చూపగలుగుతారు. రాజ్యాంగ ప్రజాస్వామ్యం ఇందుకు తగిన వెసులుబాటును, శక్తిని అందిస్తుంది.

ఎజెండాలో.. రాష్ట్రాల్లో పాలనను మెరుగుపరిచేలా ఫెడరలిజం విస్తరణను, జాతీయస్థాయిలో అధికార సాధనను విడదీసి చూడగల స్పష్టతను ఫెడరల్/పీపుల్స్ ఫ్రంట్ ప్రదర్శించగలగాలి. మూడో అంచె ఫెడరలిజం తాము కచ్చితంగా సాధించాల్సిన లక్ష్యంగా గుర్తించి మరింత సమగ్రంగా, పక్కాగా రోడ్‌మ్యాప్‌ని సిద్ధం చేసుకోవాలి.

అనుకోకుండా సమీకరణాలు మారి ప్రాంతీయ పార్టీల ఫెడరల్/ప్రజా ఫ్రంట్ అవసరానికి సరిపడా సీట్లను ఈ ఎన్నికల్లోనే సాధిస్తే లేదా ఎన్నికల అనంతర పొత్తులో భాగంగా ఏదోక జాతీయ పార్టీ బేషరతు మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగితే, గొడవే లేదు. అప్పుడైనా, ఎజెండాపై స్పష్టతే ఫలితాల్ని, భవిష్యత్ పరిణామాల్ని నిర్ణయిస్తుంది.

# సీమ, ఉత్తరాంధ్రకు ప్రాంతీయ అభివృద్ధి మండళ్లు వేయాలి

వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక అభివృద్ధి మండళ్లను ఏర్పాటు చేసి వాటికి నిధులు, అధికారాలు ఇస్తేనే అక్కడ అభివృద్ధి, యువతకు ఉపాధి సాధ్యమవుతాయని లోక్‌సత్తా 2.0 ఉద్యమ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు అన్నారు. ఈ మండళ్ల ద్వారా ప్రతి పౌరుని పేరు మీదా ఏటా రూ.1000 గ్రామ పంచాయతీలు, పట్టణ వార్డులకు కేటాయింపులు కూడా చేయాలన్నారు. నదుల అనుసంధానం చేయాలని ఎన్నో ఏళ్లుగా కేంద్రప్రభుత్వాన్ని లోక్‌సత్తా కోరుతోందని, గోదావరిని, ఒడిషాలోని మహానదిని అనుసంధానం చేయటం వల్ల ఉత్తరాంధ్ర నీటిసమస్య తీరుతుందని అన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీతో కలిసి బండారు విజయనగరంలో మీడియాతో మాట్లాడారు. గోదావరి నీటిని కృష్ణానదిలోకి మళ్లించటంతో మిగిలే 85 టీఎంసీల నీళ్లలో కర్ణాటక వాటా పోగా మిగిలిన 45 టీఎంసీల నీటిని శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా అందించటం వల్ల రాయలసీమ, తెలంగాణలోని మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయన్నారు. ఇందుకోసం అంతర్రాష్ట్ర బహుళార్థ సాధక ప్రాజెక్టుగా పోలవరాన్ని వేగంగా పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ నీటి కేటాయింపు సమస్యల్ని తెలుగు రాష్ట్రాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని, వివాదాల పేరుతో ప్రాజెక్టులను జాప్యం చేయటం తగదని అన్నారు. ఇప్పటికే ప్రాజెక్టుల సందర్శనను లోక్‌సత్తా చేపట్టిందని, వెనకబడిన జిల్లాల అభివృద్ధి, రైతులకు ఆదాయం, యువతకు ఉపాధిపై స్పష్టమైన పరిష్కారాల మీద ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేస్తున్నామని బాబ్జీ వివరించారు.

# ఆరోగ్యకరమైన పార్టీ అవసరమే

- టంకశాల అశోక్

టీఆర్ఎస్ అధినేత అయిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పరిస్థితులు కలిసివస్తే ఏర్పడగల కొత్త జాతీయపార్టీ, లేదా కూటమి కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయం అవుతుందా లేక మూడవదా అన్న మీమాంస ఒకవిధంగా అర్థంలేనిది. ఎందువల్ల? స్వాతంత్ర్యోద్యమ ఆకాంక్షలకు, ఈ దేశ ప్రజలు అందరి సమగ్ర అభివృద్ధి అవసరాలకు కాంగ్రెస్ పార్టీ తగినదికాదని స్వాతంత్ర్యానంతరపు తొలి దశలోనే తేలిపోయింది. ఆ పార్టీని తమ గుప్పిట పెట్టుకున్న ఆర్థిక–సామాజిక–రాజకీయ శక్తులు మన రాజ్యాంగాన్ని, చట్టాలను, న్యాయస్మృతులను, ప్రజాస్వామిక వ్యవస్థలను తమ స్వార్థ ప్రయోజనాల కోసం భంగపరుస్తూపోయాయి. అందువల్లనే కాంగ్రెస్ కోటలకు 1957 నాటి రెండవ సార్వత్రిక ఎన్నికల నుంచే ప్రజల అసంతృప్తి కారణంగా బీటలు వారటం మొదలైంది. ఆ ఖాళీలను ఒకవైపు ప్రజల స్థాయిలో అనేక ఉద్యమాలు ఆక్రమించాయి. మరొకవైపు అదే ప్రజలకు రకరకాల హామీలు ఇస్తూ ప్రాంతీయంగా, జాతీయంగా, వేర్వేరు సిద్ధాంతాలు, వాదనల ప్రాతిపదికగా కొత్త రాజకీయశక్తులు పూరించబూనాయి. ఆ విధంగా సాగిన కొన్ని దశాబ్దాల చరిత్రనంతా ఇక్కడ రాసుకోలేము గాని, ఈ క్రమానికంతా చివరన ప్రస్తుతం కన్పిస్తున్న దృశ్యం కాంగ్రెస్ అనండి, బీజేపీ అనండి, మరొకటి అనండి ఈ దేశానికి ఒక ఆరోగ్యకరమైన పార్టీ లేకుండా పోయింది.

ఇది ఎన్నికలలో గెలుపు ఓటములు, బలాబలాల గురించిన చర్చ కాదు. పైన మొదటి పేరాగ్రాఫ్‌లో పేర్కొన్న విధంగా కొలమానాలా ప్రశ్న. వాటికి తగిన పార్టీ అన్నది ఈ మహత్తర దేశానికి లేదు. కాంగ్రెస్‌ను ఉద్దేశించి బీజేపీ ఒక దశలో దేశ ప్రజలను 'మీకు ప్రత్యామ్నాయం కావాలా లేక ప్రతిరూపమా?' అని ఆలోచనాత్మకమైన ప్రశ్న ఒకటి వేసింది. అపుడు ఇతరత్రా రంగంలో ఉండిన ఫ్రంట్‌లు, దళ్‌లు ప్రతిరూపం మాత్రమేనని, తాము ప్రత్యామ్నాయం కాగలమన్నది ఆ ప్రశ్నలోని హామీ. ఆ విధంగా మాట్లాడి అధికారానికి వచ్చిన బీజేపీ గురించి, అదే ప్రశ్న వేసిన అగ్రనాయకుడు తాము కాంగ్రెస్‌కు ప్రతిరూపంగానే మిగిలాము తప్ప ప్రత్యామ్నాయం కాలేకపోయామని తర్వాత బహిరంగంగా అంగీకరించారు. ఇక్కడ గుర్తించవలసింది ఒకటున్నది. ఒరిజినల్ పాలకులు, వారికి ప్రత్యామ్నాయాలు, వారు ఒకరికొకరు ప్రతిరూపమా, ప్రత్యామ్నాయమా, ఫ్రంట్‌లు–దళ్‌లు రెండవ కృష్ణుడా మూడవ కృష్ణుడా వంటి తర్కవితర్కాలన్నీ ఆ పార్టీల పరిధికి సంబంధించినవి. ప్రజల దృక్కోణం నుంచి, దేశ దృక్పథం నుంచి మాత్రం ఇవన్నీ నిరర్థకంగా మారాయి. ఏవో కొద్దిపాటి తేడాలను తప్పిస్తే కాంగ్రెస్, బీజేపీ వగైరాలన్నీ ఒకే గూటి పక్షులు, లేదా 'ప్రతిరూపా'లని తేలిపోయింది.

కాంగ్రెస్ ఒక ప్రత్యేక పార్టీ అనుకుంటే, బీజేపీ మరొకటి అనుకుంటే అపుడది సాంకేతిక నిర్వచనం అవుతుంది. అపుడవి ఒకదానికొకటి ప్రత్యామ్నాయం అవుతాయి. అది సాంకేతికంగా. కాని, పైన మొదటి పేరాగ్రాఫ్‌లో చెప్పుకున్న కొలమానాలు ఈ దేశానికి అవసరమైన తాత్వికత అనుకుంటే, అపుడు ఆ రెండు పార్టీలు కూడా అసలు ప్రజలకు కావలసిన పార్టీయే కాకుండా పోతాయి. దేశానికి తగిన పార్టీయే మనకు గత 70 సంవత్సరాలలో లేదన్నమాట. ప్రజలు ఎప్పటినుంచో 'దొందూ దొందే' అంటున్నా, అదే మాటను ఇప్పుడు కేసీఆర్ సోదాహరణంగా, శక్తివంతంగా చెప్పినా దాని తాత్విక అర్థం దేశానికి తగిన, ప్రజలు కోరుకుంటున్న, స్వాతంత్ర్యోద్యమ ఆకాంక్షలను నెరవేర్చే బాటలో నడుస్తున్న పార్టీ మనకు ఈ రోజున లేదన్నమాట. మరొక మాటలో చెప్పాలంటే ఇది ఒక శూన్యస్థితి. అందులోకి ప్రవేశించవలసింది ఒక ఆరోగ్యకరమైన కొత్త రాజకీయ శక్తి. అది పార్టీయా, కూటమా అంటే ఏదైనా కావచ్చు. కాని అది ఈ విధమైన తాత్వికత గల ఆరోగ్యకరమైన కొత్త శక్తి కావాలి. అటువంటిది అయినప్పుడు ప్రజలకు దాని పట్ల విశ్వాసం కలుగుతుంది. వెంట నిలుస్తారు. కేసీఆర్ అంటున్న ఫెడరలిజం కూడా ఆ రాజ్యాంగ తాత్వికతలో భాగమే.

ప్రజలకు లోగడ కొందరి పట్ల అటువంటి ఆశాభావలు కలుగలేకపోలేదు. కాంగ్రెస్ వైఫల్యాల వల్ల శూన్యం ఏర్పడినాకొద్దీ 1960ల నుంచి మొదలుకొని వృత్తులు, కులాలు, ప్రాంతీయతలు, అసమాన అభివృద్ధుల అంశాలను ప్రాతిపదిక చేసుకుంటూ చిన్నవి, పెద్దవి అనేక ఉద్యమాలు జరిగాయి. పార్టీలు ఏర్పడ్డాయి. వాటి అజెండాలు పరిమితం అయినా, సమగ్రం అయినా సారాంశంలో మాత్రం అందరి ఆకాంక్షలు భారత రాజ్యాంగ ప్రతిఫలనాలే. చట్టాలను, న్యాయస్మృతులను

గౌరవించకుండా పాలినన్నా, రాజ్యాంగ వ్యవస్థలను భంగపరుచడం వల్ల నిరసనలుగా ముందుకు వచ్చినవే. ఆయా ఉద్యమాలకు, పార్టీలకు నాయకత్వం వహించినవారు ఎవరైనా, వారికి వ్యక్తిగత ప్రయోజనాలు ఏవైనా ఉండినప్పటికీ, వారిని నమ్మినడిచిన సాధారణ ప్రజల ఆకాంక్షలు మాత్రం స్వచ్ఛమైనవి. అవి అన్నీ పైన చెప్పుకున్న తాత్వికతకు అనుగుణమైనవి. ఒకవేళ ఈ కొత్త నాయకత్వాలు కూడా చిత్తశుద్ధితో అందుకు కట్టుబడి వ్యవహరించినా, లేక ఈ పరిణామాల నుంచి కాంగ్రెస్ పాఠాలను నేర్చుకొని తన పద్ధతులను మార్చుకున్నా ఈ రోజున భారతదేశం మరొకవిధంగా ఉండేది. 71 సంవత్సరాల తర్వాత కేసీఆర్ మార్చి (3, 4 తేదీలు) 2018 తరహా ప్రసంగాలు (ఫెడరల్/పీపుల్స్ ఫ్రంట్ ప్రకటన) చేయవలసిన అవసరం వచ్చేది కాదు.

దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ మారలేదు. కొత్తగా వచ్చిన నాయకత్వాలు ఎటువంటి శూన్యత వల్లనైతే తాము నాయకులు అయ్యే అవకాశాలు ఏర్పడ్డాయో, ఏ కారణాల మూలంగా ప్రజలు తమను నమ్మి వెంట నడిచారో అందుకు అనుగుణంగా వ్యవహరించటంలో విఫలమయారు. కొత్త పరిస్థితుల ఒత్తిడి వల్ల కాంగ్రెస్ గాని, ఈ కొత్త నాయకత్వాలు గాని అరకొరగా ఏమైనా చేసి ఉండవచ్చు. కాని సారాంశంలో అందరూ ఒకేగూటి పక్షులుగా తయారయ్యారు. ఇదే జాబితాలోకి బీజేపీ కూడా వస్తుంది. కొద్ది అటుఇటుగా వామపక్షాలు సైతం అంతే అయాయి. అందరూ కట్టగట్టకుని ఒకరికొకరు 'ప్రతిరూపా'లయారు. లేని పక్షంలో దేశంలో ఇంత నిరాశలు నెలకొనేవి కావు. పరిపాలనలు, అభివృద్ధిపరంగా ఈ స్థాయిలో అస్తవ్యస్తతలు ఉండేవి కావు. వీటన్నింటి పర్యవసానంగా రాజకీయం ఇంత అస్థిరంగా, గందరగోళంగా మారేది కాదు. ప్రపంచంలోనే ఒక గొప్ప ఉద్యమం ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న ఈ దేశం ఒక్కొక్క దశాబ్దం గడిచినాకొద్దీ అద్భుతంగా పురోగమించటానికి బదులుగా ఇట్లా నిరాశాజనకంగా మారుతుండటాన్ని చూసి సామాన్యులకు అక్షరాలా దు:ఖం కలుగుతున్నది.

ఈ దేశానికి సమగ్రాభివృద్ధిని, సామాజిక న్యాయాన్ని, ఫెడరలిజాన్ని, రాజ్యాంగతత్వాన్ని సాధించే ఒక ఆరోగ్యకరమైన పార్టీ లేదా కూటమి అవసరమనుకోవటం అందువల్లనే. అందుకు ఎవరు చొరవ తీసుకున్నా ఆహ్వానించవలసి ఉంటుంది. తాను ఆ పని చేయదలచినట్లు కేసీఆర్ చెప్తున్నారు. ఎంతో అధ్యయనం, అనుభవం, వివేకం గల ఆయనకు ఈ లక్ష్యం ఎంత కష్టతరమైనదో ఎవరూ చెప్పనక్కరలేదు. ఇటువంటి లక్ష్యాలకు అవరోధంగా నిలువగల శక్తులు చాలా బలమైనవి. ఇంతకాలపు వైఫల్యాల వెనుక వాటి ప్రమేయం ఉంది. అవి నేడు కూడా అదేవిధంగా క్రియాశీలంగా ఉన్నస్థితిలో, మార్పుకు ప్రధానమైన మద్దతు ప్రజల నుంచి మాత్రమే రాగలదని గుర్తించటం అవసరం. మార్పును చిత్తశుద్ధితో కోరుకుని సహకరించే రాజకీయ శ్రేణులు, కలసిరాగల సామాజిక శిష్టవర్గాలు, ఇతర క్రియాశీల బృందాల కోసం చాలా అన్వేషణలు కూడా జరుపవలసి ఉంటుంది. అదేవిధంగా, ఇనుమును కొలిమిలో కాల్చినపుడు అది పనిముట్టుగా మారటంతోపాటు, అందులోని దోషాలను అగ్ని పరిహరించి నికార్సుగా మార్చినట్లు, ఈ క్రమంలో ఎదురయ్యే సవాళ్ల మధ్య కేసీఆర్ కూడా నిగ్గుతేలే అవకాశం ఉంటుంది.

*(నమస్తే తెలంగాణ సౌజన్యంతో)*

# సీమ, ఉత్తరాంధ్రకు ఆ 33,000 కోట్లు వెంటనే ఇవ్వాలి



**రా**యలసీమ (ప్రకాశం జిల్లాలోని కొన్ని మండలాలు సహా), ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేకసాయం అందిస్తామని ఇచ్చిన హామీని కేంద్రం వెంటనే నెరవేర్చాలని, ఇది రూ. 33,000 కోట్ల దాకా ఉంటుందని జేపీ బృందం తేల్చిందని లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం ఇంఛార్జి బి.వెంకటరమణబాబు అన్నారు. విభజన హామీల అమలును డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఎస్.సి కాలనీలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద లోక్‌సత్తా నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకహోదాను రాజకీయ కోణంలో చూడకుండా పరిష్కారానికి పార్టీలకతీతంగా కృషి చేయాలని, ఎన్నికల కోణంలో ఆలోచిస్తే ఆంధ్రప్రదేశ్ మరోమారు నష్టపోయే ప్రమాదముంటుందని బాబు అన్నారు. ఓట్లు, సీట్లు లేకపోయినా.. విభజన హామీల అమలుకోసం లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా।। జేపీ తన వంతు ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు సునీల్, ఉపేంద్ర, ఆంజనేయులు, పవన్, ఎర్రిస్వామి, బజ్జి, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

# బడులను బాగు చేసుకోవడానికి ఫెడరలిజం



- స్టెఫాన్ ఆర్. రాఘవన్,
ఇంజినీర్, స్పేస్ ఎక్స్, ఎల్ఏ, కాలిఫోర్నియా

పిల్లలను ఏ స్కూల్లో చేర్చాలి.. ప్రైవేటు సూళ్లయితే ఫీజులు చాలా ఎక్కువ, భరించలేం.. ప్రభుత్వ బడిలో మంచి టీచర్లు ఉంటారో లేదో, సదుపాయాలు ఉంటాయో లేదో.. అని భారత్‌లో ఈనాటి తల్లిదండ్రులు బెంగపడుతుంటారు. మా నాన్న చెబుతుంటారు.. నేను, మా చెల్లెళ్లు ఇద్దరూ గ్రామాల్లోని మిషనరీ స్కూళ్లలోనే చదివామని! అదీ తెలుగు మీడియంలో. ఆ తర్వాత టెక్నికల్ కోర్సులు మాత్రం నగరంలో చదివినా, పునాది మాత్రం గ్రామాల్లోని స్కూళ్లలోనే పడిందని నాన్న చెబుతుంటే మాకు ఆశ్చర్యంగా అనిపించేంది. అప్పట్లో ఇంటి దగ్గర ఉండే స్కూలుని మాత్రమే ఎంచుకునేవారట. ఇప్పుడు వీధికి నాలుగైదు ప్రైవేటు స్కూళ్లు వచ్చేసి విద్యావ్యాపారం భారీగా పెరిగిందిగానీ, చదువు మాత్రం అత్తెసరుగా మారిపోయింది. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించటం నామోషీగా భావిస్తున్నారు. అయితే.. ప్రభుత్వం చేయాల్సిన పనుల్లో చట్టబద్ధపాలన, మౌలిక వసతులు తర్వాత విద్య, ఆరోగ్యం ఉన్నాయని, అందుకోసమే తాము పన్నులు కడుతున్నామని గుర్తించి– సర్కారీ బడిలో నాణ్యత ఎందుకు ఉండటం లేదు? అని ప్రశ్నించే ప్రయత్నాన్ని మాత్రం సక్రమంగా చేయటం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో పనికొచ్చే చదువొస్తోందా? అని కూడా తర్కించుకోవటం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో మంచి చదువు ఇంగ్లిష్ మీడియంలో అందుతోందని కొన్ని స్కూళ్లకు సంబంధించి జరిగే ప్రచారాన్ని చూసి ప్రైవేటు సంస్థలు కొంత బాధ్యతతో స్పందిస్తాయినే అభిప్రాయంతో.. ఈ స్కూళ్లలో పిల్లల్ని చేర్చేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ప్రకటనలు చూసి, దళారుల మాటలు నమ్మి స్కూళ్లను అదేపనిగా మార్చేస్తున్నవారూ ఉన్నారు.

మా తాతగారు రిటైర్డ్ ప్రొఫెసర్. అప్పటికీ ఇప్పటికీ విద్యావిధానం, పాఠశాలల పరిస్థితి, బోధనా పద్ధతుల్లో మార్పులు వంటివి చెబుతుంటారు. హైదరాబాద్ నగరానికి వలస వచ్చినవారు ఆయన్ను సలహాలు అడుగుతుంటారు. స్కూలు గురించి, ఏ స్కూల్లో బాగా టీచ్ చేస్తారు అని! పిల్లలు మార్కులు బాగా తెచ్చుకున్నారూ అంటే కారణం.. టీచరా? విద్యార్థి తెలివితేటలా?.. పిల్లలను స్కూల్లో చేర్చాం, ఇక ఫర్వాలేదు, అంతా టీచర్లదే బాధ్యత అనుకోవడానికి లేదు. ఇంటి దగ్గర చూసుకోవాలి, తప్పదు!.. అని తాతగారు చెబుతుంటారు. అటువంటప్పుడు ఖరీదైన ప్రైవేటు పాఠశాలలో చేర్చాల్సిన అవసరం ఉందా? ప్రభుత్వ పాఠశాలల పట్ల మనకున్న భయాందోళనల వల్ల గుర్తించలేకపోతున్నాంగానీ.. చాలా ప్రైవేటు స్కూళ్లలో కూడా మంచి చదువు రావటం లేదు. గ్రామీణ భారతదేశంలోని విద్యార్థులు ఏం నేర్చుకున్నారు అని గత కొన్నేళ్లుగా 'అసర్' పేరుతో ప్రథమ్ సంస్థ నిర్వహిస్తున్న వార్షిక సర్వేలో ప్రైవేటు, ప్రభుత్వ తేడా లేకుండా పిల్లల్ని పరీక్షించారు. రెండు రకాల స్కూళ్లలోనూ విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రైవేటు స్కూళ్లు కొంచెం మెరుగ్గా ఉన్నాయంతే. అంటే, సంక్షోభం మనం అనుకుంటున్నదానికంటే కూడా ఎంతో లోతైనదన్నమాట.

మేం చదువుకునేటప్పుడు ప్రభుత్వ స్కూళ్లను ఊళ్లో కాస్త పలుకుబడి ఉన్నవారు, ఎంతోకొంత చదువు ఉన్నవారు పట్టించుకునేవారు. చదువు రాకపోతే పంతులుగారిని సతాయించేవారు. మాష్టార్లు కూడా పిల్లల్ని స్కూల్‌లోనే కాకుండా తర్వాత కూడా కొంత పట్టించుకునేవారు. కానీ ఈవేళ స్కూల్లో సరిగా చదువు చెప్పకపోతే అడిగేవారు లేరు. అక్షరాస్యతోద్యమం పేరుతో పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ల మీద పెద్దఎత్తున దృష్టి పెట్టటంతో పేద, అణగారిన వర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో బడుల్లో చేరుతున్నారు. అయితే వీరిలో అత్యధికులు ప్రభుత్వ స్కూళ్లలోనే చేరాల్సి వస్తోంది. మరోవైపు ఇంగ్లిష్ మీడియం, పట్టణీకరణతో వలసలు వంటి కారణాల వల్ల పలుకుబడి, సొంత వనరులు ఉన్నవారు తమ పిల్లల్ని ఉన్నకొద్దీ ప్రైవేటు స్కూళ్లలో చేరుస్తున్నారు. దీంతో సర్కారీ స్కూళ్లలో చదువు ఎలా ఉన్నా పట్టించుకునేవారు స్థానికంగా లేకుండా పోయారు. బడుగులకు, పేదలకు చదువు సంగతులేమీ తెలియవు. పిల్లల చదువులు ఎలా ఉన్నాయో ప్రశ్నించలేక పోతున్నారు. కూలీనాలీ చేసైనా, తాము పస్తులుండైనా పిల్లల్ని చదువొస్తుందనే భ్రమలో పైస్థాయివారిని అనుకరిస్తూ ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్న పేదలు పెరుగుతున్నారుగానీ.. చదువులో సరకుందా? పనికొచ్చే చదువు అందుతోందా? అని తెలుసుకునేవారి సంఖ్య మొత్తంగా మన సమాజంలో చాలా తక్కువగా ఉంది.

మనకు చదువు పట్ల గౌరవం ఉందిగానీ.. చదువు విలువేంటో ఇంకా అర్థం కాలేదు. దాన్నో డిమాండ్‌గా, ఎన్నికల అంశంగా మార్చే దృక్పథం ఇంకా మధ్యతరగతివారిలో కూడా పెంపొందలేదు. ఈ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకునే పాలకులు చదువును సరిగా పట్టించుకోవటం మానేశారు. ప్రజల్లో చదువు పట్ల ఉన్న ఆదరణను ఓట్లు కింద మార్చుకునేందుకు కొన్ని స్కీముల్ని మాత్రం ప్రకటిస్తూ వస్తున్నారు. ఎప్పుడైతే ప్రభుత్వం, రాజకీయ పార్టీలు ఉన్నకొద్దీ విద్యారంగంలో బాధ్యతల్ని వదిలేస్తూ కేవలం ఎన్నికల ప్రచారం కోసం పైపైన స్కీముల్ని ప్రకటిస్తున్నారో, ప్రైవేటు రంగం వేగంగా విస్తరిస్తోంది. చదువులో సక్సెస్‌కి అర్థం.. ఎక్కడైనా తలెత్తుకుని నాణ్యమైన ఉపాధిని పొందగలిగే శక్తి, వ్యక్తిత్వ వికాసం అని కాకుండా.. ర్యాంకులు సంపాదించటంగా మారిపోయింది. ఇలా ఒక వెర్రిగా మనం ర్యాంకుల వెనక తిరిగే క్రమంలో– విద్యావ్యవస్థలో మంచి, చెడును పట్టించుకోవటం, దిద్దుబాటు చేయటం వంటివి ఎవరికీ పట్టని అంశాలుగా, గందరగోళాలుగా మారిపోయాయి.

## డబుల్ ట్యాక్స్‌ను కడుతున్నా ఎదిగే అవకాశాలు లేవు

మనం కడుతున్న పన్నుల డబ్బులో నుంచే ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయి, అయినా మళ్లీ ప్రైవేటుకు డబ్బు చెల్లిస్తున్నాం, అయినా మంచి చదువు రావటం లేదు.. అంటే, డబుల్ ట్యాక్స్ కట్టి కూడా ఎదిగే అవకాశాలనివ్వలేని పనికిమాలిన పాలనలో బతుకుతున్నాం.

హైదరాబాద్‌లో వారున్న ఎర్రమంజిల్ కాలనీ గవర్నమెంట్ స్కూలు గురించి తెలుసుకోవడానికి ఈ మధ్య మా బంధువులు వెళ్లినప్పుడు ఆశ్చర్యపరిచే విషయాలు తెలిశాయి. ఆ స్కూల్‌లో విద్యార్థులకు వాహనాలు ఇచ్చారట. లంచ్‌లో రోజూ బాయిల్డ్ ఎగ్, ఫ్రూట్స్ ఇస్తారట. టాయిలెట్స్, రన్నింగ్ వాటర్, మంచినీరూ ఉన్నాయి. స్కూల్‌ని బాగా పరిశుభ్రంగా ఉంచుతున్నారు. అయితే ఒక్కటే లోపం– ఓన్లీ తెలుగు మీడియం. అందువల్ల ప్రైవేటు స్కూల్లో చేర్చాల్సి వచ్చిందని చెప్పారు. అలాగే లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలోని గురుకుల పాఠశాలను సందర్శించారు. అక్కడి విద్యార్థుల అభ్యసన ప్రమాణాలను చూసి ఆనందపడిపోయారు. ప్రతిభ ఎవ్వరి సొంతం కాదు, మంచి చదువుంటే అందరికీ ఎదిగే అవకాశాలు వస్తాయి అని తాను తరచూ చెప్పే మాటలకు అక్కడ స్పష్టమైన రుజువులు కన్పించాయి. సంబంధిత ఐఏఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్‌తో మాట్లాడారు. బట్టలు, పౌష్టికాహారం, వసతి, చదువులు, ఆటలు.. అన్నీ కలిపి ఒక్కో విద్యార్థి మీదా ఏడాదికి రూ.45,000 దాకా ఖర్చవుతోందని ఆయన చెప్పారు. కానీ మిగతా తెలంగాణలో, ఏపీలో ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి మీదా ఏడాదికి రూ.65,000–70,000 వరకు ఖర్చు పెడుతున్నా మంచి చదువు రావటం లేదు. గ్రామాల్లో అసర్ సర్వే మాత్రమే కాకుండా.. ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలూ గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో స్వయంగా జరిపిన సర్వేల్లో కూడా ఇదే చేదునిజం బైటపడింది. జేపీ సురాజ్య యాత్రలో ఏపీలో సందర్శించిన పలు స్కూళ్లలో ఇదే దుస్థితి. ప్రైవేటులో కూడా పెద్ద గొప్ప చదువు రాకుండా ఉన్నకొద్దీ ఫీజులు పెరిగిపోతుంటే, మనం పన్నులు కట్టి పోషిస్తున్న ప్రభుత్వ పాఠశాలల మీద వేల కోట్లు ఖర్చు చేస్తున్నా ఫలితం లేకుంటే మనం పట్టించుకోమా? ఇలా వదిలేస్తే రాబోయే తరాలు ఎంత భయంకరంగా తయారవుతాయి? ఉద్యోగాల్లేని యువత ప్రతి ఇంటికీ, సమాజానికీ భారంగా తయారైతే అప్పుడు ఎంత బాధపడి ఏం ప్రయోజనం?

ఇందాకచెప్పిన మీడియం విషయానికొద్దాం. ఇంగ్లీషును నేర్పించే, ఇంగ్లీషులో ఓ సబ్జెక్ట్‌ని వివరించే పద్ధతులు కూడా మన విద్యాసంస్థల్లో అధ్వాన్నంగా ఉన్నాయి. ఇంగ్లీషురాని టీచర్లు ఇంగ్లీషురాని పిల్లలకు బోధిస్తున్నారు. అమెరికా వచ్చిన విద్యార్థులను పరిశీలిస్తే ఈ వైఫల్యం బాగా అర్థమైంది. ఇండియాలో ఏదో ప్రైవేటు స్కూల్‌లో బాగా ఇంగ్లీషు నేర్చుకున్నామనుకునేవారికి కూడా అమెరికాలో స్లాంగ్ (యాస) పట్టుబడటం చాలా కష్టమవుతుంది. ఇక్కడ పుట్టి ఇంగ్లీషులో పెరిగినవారికి వచ్చినట్టు ఇతరులకు ఇంగ్లీషు రావాలంటే సమయం పడుతుంది, మనదేశంలో అత్తెసరు ఇంగ్లీషుతో వచ్చినవారికైతే కనీసం 15 ఏళ్లు పడుతుంది. ఎప్పుడూ అమెరికన్స్‌తోనే మాట్లాడాల్సి ఉంటుంది. అందుకే మనవారు జంకుతో ఇండియన్స్‌తో మాత్రమే మాట్లాడతారు. ఇండియన్స్‌తోనే కలిసి ఉండటానికి ప్రయత్నిస్తారు, ఫ్రెండ్‌షిప్ చేస్తారు. వారినే అన్నిటికీ ఆశ్రయిస్తారు. రాష్ట్రాలు, దేశాలూ దాటి వచ్చినపుడు ఇంగ్లీష్‌ను అనర్గళంగా ఆయా ప్రాంతాల స్లాంగ్‌తో మాట్లాడే నైపుణ్యత తప్పనిసరి. కాబట్టి ప్రభుత్వ బడుల్లో, ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లీష్ బోధనను ప్రామాణికంగా చేసే ఏర్పాట్లు కావాలి. అయితే జేపీ చెప్పినట్టు.. ముందు స్కూళ్లను బాగు చేస్తే, ఆ తర్వాత తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం పంచాయతీలు పెట్టుకోవచ్చు. ఈలోగా కనీసం ప్రాథమిక విద్య వరకైనా ఇంట్లో మాట్లాడే భాషలోనే బోధన ఉండేలా చూడాలి.

సరిగ్గా నేనీ వ్యాసం రాస్తున్నప్పుడే ఒక వార్త తెలియవచ్చింది. వార్తాపత్రికను తిరగేస్తుంటే కనిపించింది. పలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల్ని కల్పించారని, మిగిలినవాటిలో కూడా వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని అందులో చెప్పారు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్న జార్ఖండ్, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రయత్నిస్తున్నారు. రష్యా, చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి వరుసగా 19.8:1, 16.3:1, 20.9:1, 33.6:1గా ఉంది. పొరుగు దేశాలు శ్రీలంక, నేపాల్, భూటాన్‌లలో 23.2:1,

23.1:1, 26.7:1గా ఉంది. పాకిస్తాన్ మాత్రమే మనకంటే వెనుకబడి ఉంది. సిలబస్‌ను, హోంవర్క్‌ను తగ్గించేందుకు కూడా ప్రతిపాదనలున్నాయని చెప్పారు. అమెరికాలో 3వ గ్రేడ్ వరకూ హోంవర్క్ ఉండదు. 4వ తరగతి నుంచి హోంవర్క్ ఉన్నా ఇంటి దగ్గర పుస్తకాల్ని ఇంటి వద్దే ఉంచుతారు. క్లాస్ రూంలో మరో కాపీ ఉంటుంది. వీటన్నిటి మీదా పెద్దఎత్తున కసరత్తు జరగాలి. సరైనరీతిలో త్వరగా చర్చించి అమలు చేయాలి. పరీక్షలు ర్యాంకుల కోసం కాకుండా, విద్యార్థుల్లోని సామర్థ్యాన్ని పరీక్షించేవిగా మాత్రమే ఉండేందుకు మన వద్ద పెద్దఎత్తున ప్రక్షాళన జరగాలి.

మౌలిక వసతులకు సంబంధించి స్పెసిఫిక్ ఉదాహరణగా తెలంగాణ గురించి మాట్లాడుకుందాం. సర్కారు బడుల్లో వసతుల కల్పనకు ప్రతి ఎమ్మెల్యే, ఎంఎల్సీ, ఎంపీ తన అభివృద్ధి నిధి నుంచి రూ.1కోటి ఇవ్వాలని తెలంగాణ విద్యాశాఖా మంత్రి కడియం శ్రీహరి దాదాపు రెండేళ్లుగా కోరుతున్నారు. అయితే మార్చి, 2018 నాటికి కేవలం 38 మాత్రమే ఇచ్చారట. అందరూ ఇస్తే, మ్యాచింగ్ గ్రాంట్లు కలుపుకుని రాష్ట్రవ్యాప్తంగా రూ.595 కోట్లవుతాయని, అన్ని ప్రభుత్వ పాఠశాలలకూ మౌలిక వసతులు సమకూరతాయని మంత్రి చెబుతున్నారు. ఇలా కొన్నేళ్లపాటు ఇస్తే సమస్యలు పూర్తిగా తీరతాయని చెప్పుకొస్తున్నారు. తెలంగాణలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 25,966 కాగా, అందులో నల్లా నీటి వసతి ఉన్నవి 8,525. ఇంకా 11,000 టాయిలెట్లు కావాలి. సగం స్కూళ్లకు ప్రహరీలు కావాలి అని లెక్కచెబుతున్నారు. హైదరాబాద్‌లో 159 ప్రభుత్వ పాఠశాలల్లో సొంత భవనాలు లేవు. 154 స్కూళ్లలో తాగునీరు లేదు. 145లో సైన్స్ ల్యాబ్స్ లేవు. 131 పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్స్ లేవు. ఖమ్మం జిల్లాలో 262 స్కూళ్లలో 10 కంటే తక్కువమంది విద్యార్థులున్నారు. ఏదో దానం చేసినట్టు ప్రజాప్రతినిధులు తమ ఇష్టానుసారం కేటాయింపులు చేయాల్సిన పనులా ఇవి? ప్రభుత్వం విధిగా, తప్పనిసరి ప్రాతిపదికన తొలి ప్రాథమ్యంతో చేయాల్సిన పనులు. వీటి కోసం ఏళ్ల తరబడి సాగదీస్తూంటే ఎన్ని తరాలకు అవకాశాలు పోతాయి? ప్రతి స్కూలునూ భద్రతతో, సాంకేతికత తో, ఆధునిక లైబ్రరీలతో తీర్చిదిద్దేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవటం అవసరం.

మౌలికవసతులు, దాని చుట్టూ ఉన్న అంశాలు ఒకెత్తు.. అత్యధికశాతం పాఠశాలల్లో మంచి విద్యాప్రమాణాలు లేకపోవటం మరో ఎత్తు! నిజానికి వసతులుగానీ, ఉపాధ్యాయ ఉద్యోగాలుగానీ విద్యార్థులకు మంచి చదువును అందించే సాధనాలే తప్ప లక్ష్యాలు కావు. 2009లో వచ్చిన విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులంటూ కొన్ని నిబంధనలు విధించి, లంచగొండితనాన్ని, అధికారుల పెత్తనాన్ని పెంచి పోషించారు. ఇంత చేస్తున్నా ప్రైవేటు స్కూళ్లలో చేరేందుకే పేదలు సైతం మొగ్గు చూపుతున్నారెందుకో ప్రభుత్వం ఆలోచించాలి. ప్రతి బిడ్డకూ మంచి చదువు అందించటం చుట్టూ మిగిలిన అంశాల్ని తిప్పితేనే.. చేస్తున్న ఖర్చు నుంచే ఫలితాలు రావడం మొదలవుతుంది, వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలు లభిస్తాయి. ఇందుకోసం.. మారిన పరిస్థితుల కనుగుణంగా ఉపాధ్యాయులకు తగిన శిక్షణను అందించాలి, ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేస్తుండాలి. విద్యార్థులకు అందుతున్న చదువుకు, ఉపాధ్యాయుల జీతాలకు లంకె పెట్టాలి. మనం ఎలా చెప్పినా మన జీతాలు వచ్చేస్తాయి అనే ధోరణి పోయి.. మంచి చదువును అందించినకొద్దీ మనకు ఆదాయం పెరుగుతుందన్న స్పష్టత ఉపాధ్యాయుల్లో కలిగేలా చేయాలి. తెలంగాణలో 2018 మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో కూడా మాస్ కాపీయింగ్ భారీగా జరిగింది. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాలూ పోటాపోటీగా ఉన్నాయి. కొన్ని జిల్లాలు మాస్ కాపీయింగ్‌లో ఏటా కొత్త రికార్డుల్ని సృష్టిస్తున్నాయి. తప్పు చేయటం, మోసం చేయటం, మన సోమరితనపు సుఖాల కోసం వ్యవస్థల్ని నాశనం చేయటం తప్పుకాదని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే పిల్లలకు నూరిపోస్తుంటే, ప్రభుత్వం చోద్యం చూస్తుంటే ఇక ఆ సమాజం ఏం బాగుపడుతుంది? అంతా బాగున్నట్టు నటిస్తూ మన వేళ్లతో మన కళ్లు పొడుచుకుంటున్నాం. ఈ వైఫల్యాలన్నిటినీ చక్కదిద్దేలా ప్రక్షాళన జరగాలి. ర్యాంకులకన్నా నైపుణ్యం, వికాసం ఉన్న చదువు మీద దృష్టి పెట్టాలి.

ఉపన్యాసాలు ఇచ్చినంత తేలిగ్గా, రాజకీయ సమీకరణాల కోసం కోల్‌కతా, ముంబయి, ఢిల్లీ, చెన్నై, బెంగళూరులకెళ్లి మీటింగులు పెట్టినంత తేలిగ్గా విద్యారంగాన్ని బాగుచేయలేరు. ఇందుకోసం సామాన్య ప్రజల పట్ల అంతులేని ప్రేమ, ప్రజాస్వామిక సంస్కృతి, ఉత్తమ ఆలోచనలు ఎక్కడున్నా ఆహ్వానించగల రాజనీతిజ్ఞత, దీర్ఘకాల దృక్పథంతో కష్టపడే స్వభావం, చెదరని రాజకీయ సంకల్పం వంటివి అవసరం. విద్య, ఆరోగ్యం వంటి రంగాలను బాగుచేయటానికి రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలనటంలో సందేహం లేదు. రిజర్వేషన్ల కంటే కూడా ఫెడరలిజం అవసరమున్న రంగాలివి. విద్యాహక్కు చట్టంలో లోపాల్ని ఇప్పటి దాకా రాష్ట్రాల్ని సరిచేసుకోలేక పోవటానికి కేంద్రంలో మితిమీరిన అధికార కేంద్రీకరణ పెద్ద అవరోధం. అందుకే రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలని, ఫెడరలిజం విస్తరించాలని లోక్‌సత్తా తొలి నుంచీ చెబుతోంది, లోక్‌సత్తా మలిదశ ఉద్యమం (2.0) పత్రంలో కూడా ఇది కీలకాంశంగా ఉంది. విద్యను బాగు చేయటాన్ని ప్రభుత్వాలు, పార్టీలు, ఆలోచనాపరులు, మీడియా, సమాజం ఓ ఉద్యమంలా చేపట్టటం, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండియా అనే స్థాయికి ఫెడరలిజం విస్తరణకు, స్థానిక ప్రభుత్వాల సాధికారతకు కృషి చేయటం అవసరం.

# భారతదేశ శక్తిసామర్థ్యాలను వెలికితీసేందుకు మూడో దశ ఫెడరలిజం కావాలిప్పుడు!

- డా॥ జయప్రకాష్ నారాయణ్

**ప్రపంచంలో మరే ప్రజాస్వామ్యంలో కూడా ఫెడరల్ (సమాఖ్య) రాజ్యాంగం ఇలా ఒకేతరహా పాలనా నిర్మాణాన్ని, ఎన్నికల విధానాన్ని, ప్రభుత్వోద్యోగ వ్యవస్థని రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాల మీద రుద్దదు.**

**ప్రతి రాష్ట్రం తన సొంత పాలన, అధికార యంత్రాంగం, స్థానిక ప్రభుత్వాల నమూనాను ఏర్పాటు చేసుకునేందుకు మనం మార్పులు చేసుకోవాలి.**




కేంద్ర-రాష్ట్ర సంబంధాలు మనదేశంలో సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓ కీలకాంశంగా మారాయి. దీనిచుట్టూ జరుగుతున్న చర్చలో అతిశయోక్తులున్నాయి, ఎన్నికల కోణాలూ ఉన్నాయి. తన రాజకీయ విస్తరణను అప్రతిహతంగా కొనసాగించాలి, ఏం చేసైనా ఎన్నికల్లో నెగ్గాలి అన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ధోరణితో ఈ చర్చ మరింత వాడీవేడిగా మారింది. అయితే, మన ఫెడరలిజాన్ని పార్టీలకతీతంగా సమీక్షించు కోవటానికి ఈ పరిస్థితులన్నీ ఒక అవకాశాన్ని అందిస్తున్నాయి. మన గణతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసుకున్ననాటి నుంచి ఇప్పుడు మూడో దశ ఫెడరలిజంలోకి మనం అడుగుపెడుతున్నాం.

భారతదేశ విభజన సమయంలో చోటుచేసుకున్న భయానక హింసాత్మక ఘటనలు, దేశం ముక్కలైపోతుందేమోనన్న భయం మన స్వాతంత్ర్యోద్యమ నేతల్ని జాతీయ స్థాయిలో మితిమీరిన కేంద్రీకృత ప్రభుత్వం ఏర్పాటు వైపు మొగ్గు చూపేలా చేశాయి. రాష్ట్రాల్లో శాసన వ్యవస్థ, ప్రభుత్వ పరిమితుల్ని రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లో స్పష్టంగా నిర్వచించారు. రాష్ట్రాలతో వ్యవహారాలు కొంతమేరైనా న్యాయబద్ధంగా ఉండేలా భరోసా ఇచ్చేందుకు.. ఆర్థిక సంఘం, ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టులను ఏర్పాటు చేశారు. అయితే, రాష్ట్ర అధిపతిగా విచక్షణాధికారాలతో పై నుంచి నియమితుడయ్యే గవర్నర్, ఆర్టికల్ 356, ఆలిండియా సర్వీసులు, ప్రణాళికా సంఘం, లైసెన్స్-పర్మిట్-కోటా-రాజ్‌ను ప్రవేశపెట్టటం.. ఇవన్నీ రాష్ట్రాల అధికారాల్ని గణనీయంగా హరించివేశాయి. పార్టీ రాజకీయ లబ్ధి కోసం తన అధికారాలను కేంద్ర ప్రభుత్వం అలవాటుగా దుర్వినియోగం చేయటం, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను తరచూ డిస్మిస్ చేయటం, ప్రభుత్వ, ప్రయివేటు పెట్టుబడలను దాదాపుగా కేంద్రమే నియంత్రిస్తుండటం, వనరుల బదిలీలో కేంద్ర ప్రభుత్వానికి మితిమీరిన విచక్షణాధికారం, భారత్‌ను ఏకీకృత వ్యవస్థ దేశంగా మార్చిన అంతర్గత ఎమర్జెన్సీ, 1977, 1980ల్లో రాష్ట్ర ప్రభుత్వాలను మూకుమ్మడిగా రద్దు చేయటం- తీవ్ర ఘర్షణ

వాతావరణానికి దారితీశాయి.

రెండోదశలో, ఎన్.టి రామారావు, రామకృష్ణ హెగ్డే, జోతిబసు, బిజూ పట్నాయక్, ఎం. కరుణానిధి వంటి శక్తిమంతమైన నాయకులు ముందుకొచ్చి ఫెడరలిజం, రాష్ట్రాల హక్కుల చుట్టూ ప్రజలను సమీకరించారు. ఎస్.ఆర్ బమ్మయి కేసులో తీర్పు (1994) తర్వాత ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసి రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయటం గతకాలపు పీడకలగా మారిపోవటం, వనరుల బదిలీపై ప్రతి ఆర్థిక సంఘమూ సిఫార్సు చేయటం, లైసెన్స్‌రాజ్ అంతమవటం, విచక్షణాధికారంతో కూడిన ప్రభుత్వరంగం పెట్టుబడులు బాగా తగ్గటం, ప్రాంతీయ పార్టీలు పెరగటం, ప్రణాళికా సంఘం రద్దు- పరిణామాలు కూడా మరింత సమతులమైన ఫెడరల్ భారతదేశ నిర్మాణానికి దారితీశాయి. ఉదాహరణకు, 2017-18 సవరించిన అంచనాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసే సుమారు రూ. 22 ట్రిలియన్‌లలో సగం డబ్బు రాష్ట్రాలకు బదిలీ అయింది. మొత్తం వనరుల బదిలీలో.. 69.4శాతం ఆర్థిక సంఘం వికేంద్రీకరణ, గ్రాంటుల ద్వారా, మిగిలిన దాంట్లో ఎక్కువభాగం కేంద్ర ప్రాయోజిత పథకాల రూపంలో ఉంటోంది. భారతదేశ ఫెడరలిజం కొంతమేర పరిణతిని సాధించింది. తొలిదశలో కంటే రాష్ట్రాలకు ఇప్పుడు తమ ఆర్థిక వనరుల మీద, రాజకీయ నిర్వహణ మీదా నియంత్రణ బాగా పెరిగింది.

అయితే, లోతైన వ్యవస్థాగత సమస్యలు మాత్రం అలాగే మిగిలిపోయాయి. ప్రజలకు అవసరమైనవీ, ప్రభుత్వం నుంచి రోజువారీ వారు ఆశించేవీ- నీటి సరఫరా, విద్యుత్తు, పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణ, పోలీసు, కోర్టులు, రోడ్లు, ట్రాఫిక్, పాఠశాలలు, కళాశాలలు, వైద్య ఆరోగ్య సేవలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రకరకాల సేవలు- వంటి చాలా అంశాలకు రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాలే




బాధ్యత వహించాల్సి ఉంటుంది. మన రాజకీయాలు ప్రధానంగా రాష్ట్రాల చుట్టూ తిరుగుతుంటాయి. జాతీయస్థాయిలో ఎన్నికల తీర్పులు సాధారణంగా రాష్ట్రాల్లో ప్రజల తీర్పులకు కేవలం సంకేతం లేదా ప్రతిరూపం మాత్రమే. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు అన్ని ఎన్నికల్లో ప్రజలు రాష్ట్రంలోని నాయకుల్ని లేదా పార్టీల్ని చూసి ఓటు వేస్తుంటారు. తగిన సేవలు అందించటంలో విఫలమైతే వారిని శిక్షిస్తుంటారు. చాలామందికి చాలా సందర్భాల్లో జాతీయ స్థాయి ప్రభుత్వం ప్రధానంగా మాటల సందర్భంగా చెప్పుకోవడానికే. నిజమైన అధికారాన్ని వినియోగించేది రాష్ట్రాలే! అయినా, ప్రజలకు సేవల్ని సక్రమంగా అందించేందుకు మార్పులు చేసే అధికారాలకు సంబంధించి రాష్ట్రాలపై బోలెడు నియంత్రణలు అమలవుతుంటాయి. స్వతంత్ర భారతదేశ తొలి ఐదు దశాబ్దాలలో కేంద్ర ప్రభుత్వాల ఏకపక్ష, పక్షపాత రాజకీయ వైఖరుల వల్ల ఫెడరలిజం క్షీణించింది. తొలినాళ్లతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వానికి ఇప్పుడు తక్కువ విచక్షణాధికారం ఉంది. అయినా కూడా, ప్రజలకు తామిచ్చిన హామీల్ని నెరవేర్చడానికున్న సంకెళు కొనసాగు తుండటం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు సతమతమవుతున్నాయి.

కేవలం పార్టీ రాజకీయాల వల్లే ఈ సమస్యలు.. అనుకునే రోజులు పోయాయి. ఈ సమస్యలు వ్యవస్థాగతమైనవి, రాజ్యాంగ పరమైనవి! దృఢత్వం పేరుతో పెద్ద మార్పునకు అవకాశంలేని మూస రాజకీయ నమూనాను రాజ్యాంగం, పాలన ద్వారా అన్ని రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాల మీద రుద్దారు. ప్రజలు నివసించే చోట, వారికి రోజూ ఉండే స్థానిక అవసరాలను ఈ కేంద్రీకృత వ్యవస్థ ఎలా తీరుస్తుందన్న విచక్షణ కొరవడింది.

ఆర్టికల్ 311 ద్వారా అపరిమిత రక్షణను అనుభవిస్తూ కూడా ప్రజలకు నాణ్యమైన సేవలందించని పాలనా యంత్రాంగం, పరిజ్ఞానంతో సంబంధం లేకుండా ప్రతి ప్రభుత్వరంగంలోనూ ఏకఛత్రాధిపత్యాన్ని చెలాయిస్తూ అన్నిటికీ ఒకే మంత్రమన్నట్టు తయారైన ఆలిండియా సర్వీసులు, మంచి ఉద్దేశంతోనే అయినా అధ్వాన్నంగా రూపొందించిన రాజ్యాంగంలోని పార్ట్ 9 వల్ల విగ్రహపుష్టి తప్ప నిజమైన అధికారాలు లేక నిర్వీర్యమైన స్థానిక ప్రభుత్వాలు.. మూడో అంచె ఫెడరలిజం వేళ్లూనుకోకుండా దెబ్బతీశాయి. విద్య వంటి రంగాల్లో కేంద్ర చట్టాల్లో ఉన్న అనవసర కఠినత్వం వల్ల.. డబ్బులు పెద్దఎత్తున ఖర్చు పెడుతున్నా

సంస్కరించుకునే అవకాశాలు రాష్ట్రాలకు లేక పేలవమైన ఫలితాలు వస్తున్నాయి. వలసకాలపు బూజుపట్టిన సంస్కృతిలో భాగంగా కొనసాగుతున్న నామినేటెడ్ గవర్నర్లు రాష్ట్రాలను, స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేస్తున్నారు.

మన పాలనా వైఫల్యాలు.. మన ఆశలకు విరుద్ధమైన, ప్రమాదకరమైన ఫలితాలకు దారితీస్తున్నాయి. మన పట్ల మనకు ఎంత గొప్ప భావనైనా ఉండొచ్చు, మనలోలోపల ఎంత సత్తా అయినా దాగివుండొచ్చు, మనం ఎన్ని సామర్థ్యాలైనా ప్రదర్శించగలిగి ఉండొచ్చు.. కానీ, ఇన్ని సానుకూలాంశాల మధ్య కూడా ఒక దేశంగా మనం సంతృప్తికరమైన విజయాల్ని సాధించలేకపోయాం. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 200 బిలియన్ డాలర్లకు పైబడిన 49 దేశాలనే తీసుకుంటే.. కీలకమైన ప్రతి సూచీలోనూ భారత్ చిట్టచివరి స్థానాల్లో ఉంది. కనీస వసతులు, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం.. అన్నిటిలో మనం పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియాల సరసన ఉన్నాం. ఇంతకంటే ఎక్కువ సాధించటానికి, పొందటానికి మన ప్రజలకు అన్ని అర్హతలూ ఉన్నాయి. ఒక దేశంగా మనలోని ప్రతిభాసామర్థ్యాలు ఎంతోమేర వెలుగు చూడకుండానే ఇంకిపోతున్నాయి. మూడో దశ ఫెడరలిజం ఆవశ్యకతను స్పష్టంగా తెలియజెప్పే వాస్తవాలివి! మన దేశ ఐక్యతను, సమగ్రతను, మన రాజ్యాంగ స్వేచ్ఛలను, పరస్పర పర్యవేక్షణతో సమతులత పరిచే ఏర్పాట్లను, ప్రజాస్వామిక జవాబుదారీతనాన్ని కాపాడుకుంటూనే మూడో దశ ఫెడరలిజాన్ని మనం నిర్మించుకోవాలి.

మరే ప్రజాస్వామిక దేశంలోనూ ఫెడరల్ రాజ్యాంగం ఇలా ఒకే మూస విధానాన్ని, ఎన్నికల వ్యవస్థని, పాలనా యంత్రాంగం నిర్మాణాన్ని రాష్ట్రాల మీద, స్థానిక ప్రభుత్వాల మీదా రుద్దదు. ఒక చిన్న ఏకీకృత దేశమైన బ్రిటన్‌లో కూడా.. స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్, లండన్ నగరం తమ సొంతంగా, వెస్ట్‌మినిస్టర్ నమూనాకు భిన్నమైన ఎన్నికల విధానాల్ని అమలుచేసుకుంటున్నాయి. అమెరికాలోని 50 రాష్ట్రాల్లో ప్రతీ రాష్ట్రానికీ సొంత రాజ్యాంగం, సొంత ప్రభుత్వ నిర్మాణాలు ఉన్నాయి. ఆస్ట్రేలియాలో కూడా, ఆరు రాష్ట్రాల్లో ప్రతి దానికీ సొంత రాజ్యాంగాలున్నాయి. స్వయంపాలనా ప్రతిపత్తి ప్రాంతాలకూ అలాగే సొంతంగా రాజ్యాంగాలు ఉన్నాయి. జర్మనీలో ప్రతి రాష్ట్రం తన పాలనని నిర్ణయించుకునేలా తగిన వెసులుబాటును, అధికారాన్ని కల్పించే సొంత రాజ్యాంగాన్ని కలిగి ఉంది. కెనడాలో 10 ప్రావిన్సులకీ ఎన్నికల వ్యవస్థను ఎంచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి, స్థానిక ప్రభుత్వ నిర్మాణాన్ని రూపొందించు కోవటానికీ హక్కు ఉంది.


మూడో దశ ఫెడరలిజం వైపు అడుగేయాల్సిన సమయం భారత్‌కు ఆసన్నమైంది. మన దేశంలోని అనేక రాష్ట్రాలు ప్రపంచంలోని 90శాతం దేశాలకన్నా పెద్దవి. సొంత పాలనా నమూనాను, పాలనా యంత్రాంగాన్ని, స్థానిక ప్రభుత్వాలను రూపొందించుకునేందుకు ప్రతి రాష్ట్రానికీ మనం అనుమతినివ్వాలి. అయితే జాతీయ ఐక్యత, అధికారాల విభజన, ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామిక జవాబుదారీతనం విషయంలో రాజీలేని విధంగా ముందు జాగ్రత్తల్ని ఏర్పాటు చేసుకోవాలి. 130 కోట్ల జనాభా కలిగిన సువిశాల భిన్నత్వ దేశం మనం ఆశిస్తున్న అభివృద్ధిని సాధించడానికి, పేదరికాన్ని నిర్మూలించడానికి, గొప్పస్థాయిని అందుకోవడానికి అన్నిటికీ ఒకే నమూనా విధానమనే ధోరణి పనికిరాదు. భారతదేశ ఐక్యతను, సమగ్రతను కాపాడేందుకు, మనలోని శక్తిసామర్థ్యాలను వికసింపచేసేందుకు మరింత వెసులుబాటున్న ఫెడరలిజం మనకిప్పుడు కావాలి!

## 2025 నాటికి రూ.325 లక్షల కోట్లు

వచ్చే ఏడేళ్ల (2025) నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం రెట్టింపై 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.325 లక్షల కోట్లు) స్థాయికి పెరగనుందని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది. స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఇలు, మౌలికరంగ పెట్టుబడుల ఊతంతో దేశ వృద్ధి రేటు గరిష్టస్థాయికి చేరుకోనుందని తెలిపింది. "మనదేశం వచ్చే 7-8 ఏళ్ల పాటు వస్తు తయారీ, సేవలు, వినిమయ డిమాండ్‌పై దృష్టి సారించగలిగితే 2025 నాటికి ఆర్థిక వ్యవస్థ పరిమాణం 5 లక్షల కోట్ల డాలర్లకు చేరవచ్చు. ఇది సునాయాసంగా సాధించే లక్ష్యమే" అని ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి అన్నారు. దేశ వృద్ధి రేటు 7-8 శాతానికి చేరుకుంటుందన్నారు. ప్రస్తుతం భారత్ 2.5 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది.

# సెంటిమెంట్‌ని రగల్చటం తప్ప.. 'హోదా'పై ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నమేదీ?

- డాక్టర్ వంక వెంకట రామదాస్
పీపుల్స్ నర్సింగ్ హోం, తణుకు



ఆ రోజు (ఏప్రిల్ 16, 2018) ఆంధ్రప్రదేశ్‌లో బంద్! అఖిలపక్ష పార్టీలు, సంస్థలు కలసి బంద్‌ను నిర్వహించాయి. తణుకులోని మా హాస్పిటల్‌కి రోగులు మెల్లమెల్లగా వస్తూనే ఉన్నారు. ముసలివాళ్లు మాత్రం చాలా ప్రయాసపడి, అరిగిపోయిన మోకాలిచిప్పలతో ఒగరుస్తూ, ఆయాసపడుతూ వచ్చారు. ఎందుకంటే, బస్సులు లేవు, ఆటోలను, పట్టణ పొలిమేర్లలోనే ఆపివేశారు. కార్లు, ఇతర సొంత వాహనాలున్నవారు మాత్రం యధావిధిగా దర్జాగానే వచ్చి వైద్యం చేయించుకుని వెళ్లారు.

ప్రతి పేషెంటునూ పరీక్షించి మందులు రాసి ఇచ్చే ముందు, రెండు, మూడు ప్రశ్నలు అడిగాను. బంద్ ఎవరు చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు? ప్రత్యేక హోదా అంటే మీకు తెలుసా? అని. ఏప్రిల్ 16న చూసిన 35 మంది పేషెంట్లలో ఇద్దరు మాత్రమే బంద్‌ను ప్రతిపక్ష పార్టీలు కలిసి చేస్తున్నాయి అని చెప్పారు. ఆ ఇద్దరు మాత్రమే.. హోదా వస్తే రాష్ట్రంలో ఉద్యోగాలు వస్తాయన్నారు. ఆ ఇద్దరు యువకులు కూడా.. ప్రత్యేక తరగతి హోదాకు, ప్రత్యేక ప్యాకేజీకి గల తేడాను గానీ, తప్పు ఎవరిదని గానీ చెప్పలేకపోయారు.

ఎవరు బంద్‌లు నిర్వహించినా, షాపులు మూయించి, రవాణాను స్తంభింపచేసి, బంద్ 100శాతం సక్సెస్ అని ప్రకటించుకుంటారు. చాలా సందర్భాల్లో తొంభై శాతం ప్రజలకు బంద్‌ల ఉద్దేశంగానీ, దాని కార్యాచరణ గురించిగానీ తెలియదు. ఎవరు చేస్తున్నారో, ఎందుకు చేస్తున్నారో పెద్దగా అవగాహన కూడా ఉండదు. బంద్ ఉద్దేశం ప్రజలను చైతన్యపరచటమే అయితే, మరి వారికి విషయం తెలియాలి గదా? వారి సమ్మతి ఉండాలి గదా?.. స్వతంత్రం వచ్చాక వలసపాలన కాలం నాటి బంద్‌లు, రాస్తారోకోలు ఉండకూడదని, రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో పోరాడాలని డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగసభలో విస్పష్టంగా చెప్పారు. దీన్ని లోక్‌సత్తా నూరుశాతం అంగీకరించి పాటిస్తుంది. విప్లవమంటే, ప్రజల హక్కులను హరించటం, వారికి నష్టం చేయటం, హింసకు పాల్పడటం, రక్తం చిందించటం కాదని.. ప్రజలకు వారి జీవితాల్లో మేలిమి మార్పును తెచ్చే ఆచరణాత్మక అంశాలపై అవగాహన కలిగించటమే నిజమైన విప్లవమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తరచూ చెబుతుంటారు. విభజన వల్ల హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే మిగిలిన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తును పరిరక్షించేందుకు ప్రత్యేకహోదాను మొట్టమొదట ప్రతిపాదించటంతోపాటు, ఆ ప్రయోజనాలను సాధించేందుకు పార్టీలకతీతంగా చేసిన, చేస్తున్న తన వంతు కృషిలో కూడా జేపీ ఇదే నిర్మాణాత్మక ధోరణితో పనిచేస్తున్నారు. వాస్తవాలు, హేతుబద్ధ వాదనలపై ప్రజల్లో చైతన్యాన్ని పెంచుతూ కేంద్రం నుంచి నిధుల్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. లక్ష్యసాధనలో ఎవరితోనైనా కలిసి పనిచేయటం, ఎవరూ చేయనప్పుడు తానే ప్రయత్నించటం లోక్‌సత్తా రాజకీయ సంస్కృతి. ఈ తరహా ప్రయత్నం లేకుండా.. మూకుమ్మడి బంద్‌లు చేయటం వల్ల, చెరువు మీద అలిగిన రీతిలో చివరికి నష్టం తెలుగువారికే కాదా? మనల్ని మనం శిక్షించుకోవటం ఆరోగ్యకరం కాదు, నాగరికతా కాదు!

విషయం లేకపోయినా ఆర్భాటంగా ప్రచారం చేస్తే ప్రజలు ఆకర్షితులవుతున్న మాట ఇప్పటికీ వాస్తవమే. ఎందుకంటే, దేశంలో మెజారిటీ ప్రజలకు నాణ్యమైన విద్యనందించటంలో స్వతంత్రం వచ్చిన దగ్గర్నుంచి పాలకపక్షాలు, ఇతర రాజకీయ వ్యవస్థ ఘోరంగా విఫలమయ్యాయి. విద్యను సరిగా పట్టించుకుని రాజకీయానికి కేంద్ర బిందువు చేసి

ఉంటే.. అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం కచ్చితంగా వేళ్లూనుకుని ఉండేది. ఇప్పటికీ.. అందరికీ నాణ్యమైన విద్యను అందిస్తూ, ప్రజల్ని ఎక్కడికక్కడ పాలనలో భాగస్వామ్యం చేసేందుకు ప్రయత్నించకుండా కేవలం ఎన్నికల్లో ఓటు వేసే యంత్రాలుగా మాత్రమే వారిని పరిగణిస్తుండటం వల్లే ఇలాంటి మొక్కుబడి బంద్‌లు, బహిరంగ సభలు, రాస్తారోకోలు వంటివి కొనసాగుతున్నాయి. ఊరి పొలిమేర్లలో రవాణాను 20–30 నిమిషాల పాటు నిలిపి, హ్యాండ్ మైక్‌తో ప్రత్యేక హోదా, అందులోని అంశాలు, పార్లమెంటులో ప్రధానమంత్రి ఇచ్చిన హామీ, ఫెడరల్ వ్యవస్థలో ఇతర రాష్ట్రాలకు ఇబ్బంది లేకుండా మనం హోదా రాయితీల్ని సాధించుకోవటం వంటివి వివరించే కార్యక్రమం చేపట్టి ఉంటే.. బంద్‌కన్నా ఎక్కువగా ప్రజల మీద ప్రభావం చూపి ఉండేదనటంలో సందేహం లేదు. దఫదఫాలుగా ప్రతీచోటా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తే (మంచినీరు అందిస్తూ), ప్రజలు అసౌకర్యం కలిగినా అవసరమైన కార్యక్రమంగా గుర్తించి మనసు పెడతారు. ఇష్టపూర్వకంగా ఆలోచిస్తారు, తప్పుకు కారణమైనవారికి తగిన గుణపాఠం చెప్పేలా ఎన్నికలతీర్పునిస్తారు. రాజ్యాంగ ప్రజాస్వామ్య మార్గంలో ప్రజలను చైతన్యపరుస్తూ క్రియాశీల భాగస్వాముల్ని చేస్తూ కలసికట్టుగా కృషి చేయటం మన భవిష్యత్ లక్ష్యాల సాధనకు కూడా ఎంతో అవసరం.

విభజన చట్టంలో ఉన్న అంశాలే కాదు.. ప్రధానమంత్రి పార్లమెంటులో ఇచ్చిన హామీ కూడా చట్టంతో సమానమేనని చెప్పటానికి న్యాయకోవిదుల దాకా వెళ్లనక్కర్లేదు. ఫెడరల్ వ్యవస్థలో, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో, ఒక రాష్ట్రంపై, ఓ గంభీరమైన సమయంలో పార్లమెంటులో ప్రధానమంత్రి చేసిన ప్రకటనకు అంత విలువ, బాధ్యత ఉంటాయి. ప్రత్యేక హోదాను కాంగ్రెస్‌వాళ్లు చట్టంలో చేర్చలేదు అని బీజేపీ వాళ్లు తప్పించుకోలేరు. అయితే హోదాలో పారిశ్రామిక రాయితీలు భాగం కాదు, హోదా కంటే ప్యాకేజీ బెటరు అని ముఖ్యమంత్రే తీర్మానించి అందరి నోళ్లూ మూయించే ప్రయత్నం చేయటంతో సమస్య జటిలమైంది. కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యం, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయలోపం ప్రస్తుత సమస్యకు కారణమని స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు కూడా హోదా ద్వారా వచ్చే ప్రయోజనాల్ని కేంద్రం నుంచి పొందే ప్రయత్నం మీద కంటే, దీని చుట్టూ సెంటిమెంట్‌ను ఎక్కువగా రగిల్చి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే రాష్ట్రంలో ఎక్కువగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రత్యేక హోదా అంటే ఆంధ్రప్రదేశ్‌లో ఒక సెంటిమెంటే తప్ప, దాని ద్వారా ఏమొస్తుందో నిర్దిష్టంగా కోట్లాదిమంది సామాన్యులకు తెలియదు. హోదా అంటే ఏమిటో తెలియకుండానే, హోదా చుట్టూ జరిగే ఎన్నికల్లో ఎవరు ఎక్కువ ప్రచారం చేసుకుంటే వారికి ఓటు వేసే అమాయక ప్రజలే ఎక్కువగా ఉన్నప్పుడు.. ఎన్ని ఎన్నికలచ్చినా, ఎవరు గెలిచినా రాష్ట్రానికి ఒరిగేదేముంటుంది? మనం చేసే పనిలో పరమార్థం సరిగా ఉంటేనే మార్పు సాధ్యమవుతుంది. ప్రతిపక్షాల బంద్‌ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. బంద్ మూలంగా రాష్ట్రానికి వచ్చిన నష్టం గురించి లెక్కలు చెప్పారు. సరైనదే. కానీ ఆయన ఆర్భాటపు దీక్ష, ప్రయాణాలు, ప్రచారాలు, కార్యక్రమాల మాటేమిటి? వాటి వల్ల ఎంత ప్రజాధనం వృధా అయింది? అలాగే ప్రధానమంత్రి మోదీని కూడా ఆయన గట్టిగా ఎదిరిస్తున్నారు. కానీ, అది వ్యక్తిగత పోటీలానే ఉంది. మోదీ విధానాలను, కేంద్రీకృత పాలనను చంద్రబాబు ప్రశ్నించటం లేదు. మరోవైపు, ఓట్లు, సీట్లు, జనాల్లో కాస్త ప్రాచుర్యమున్న ప్రతిపక్షాలు కూడా ముఖ్యమంత్రిని ఓ పార్టీ నాయకుడిగానే చూస్తుండటం గందరగోళాన్ని మరింత పెంచుతోంది. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి ప్రజలందరికీ బాధ్యత వహించేవారు తప్ప వారి పార్టీకి మాత్రమే కాదు. ఏపీ అంటే చంద్రబాబు, ఇండియా అంటే నరేంద్ర మోదీ కాదు. ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన అఖిలపక్షాలకు వైకాపా, జనసేన, బీజేపీ తదితర పార్టీలు కూడా హాజరై తమ అభిప్రాయాల్ని చెప్పి సూచనలిస్తే బాగుండేది. ఇప్పటికే ఆలస్యమైనా.. కేంద్రంపై పోరాటానికి రాష్ట్రం మొత్తానికీ ప్రాతినిధ్యం వహించే ముఖ్యమంత్రి నాయకత్వం వహించటం మెరుగైన పద్ధతి. పార్టీలు, సంఘాలు వేర్వేరుగా తమ కార్యక్రమాలను నిర్వహించుకుంటూనే.. ముఖ్యమంత్రితో కలిసి జాతీయస్థాయి ప్రభుత్వం నుంచి నిధుల్ని రాబట్టటానికి కృషి చేయటం అవసరం. ఏ పేరుతోనైనా ప్రత్యేకహోదా రాయితీలు, రాయలసీమ (ప్రకాశం జిల్లాలోని కొన్ని మండలాలు సహా), ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేకసాయం, ఇతర విభజన హామీల్ని సాధించుకోవడానికి అవగాహనతో, సంఘటితంగా పోరాడటంతోపాటు.. సాధించుకున్న నిధుల్ని నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, వ్యవసాయాధారిత చిన్న పరిశ్రమలు, చిన్న పట్టణాల అభివృద్ధి, వికేంద్రీకరణతో స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, చట్టబద్ధపాలన వంటి అంశాల కోసం వినియోగిస్తేనే ఆంధ్రప్రదేశ్ ప్రజలు సుస్థిరాభివృద్ధిని సాధించగలుగుతారు.

# విభజన హామీల అమలు కోసం లోక్‌సత్తా ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ నిరాహారదీక్ష









అన్ని రాజకీయ పార్టీలూ ఒకే వేదికపైకి వచ్చి విభజన హామీల్ని సాధించుకోవాలని, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక సాయాన్ని ప్రకటించాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా విజయనగరంలో నిర్వహించిన ఒకరోజు నిరాహారదీక్షకు విశేష స్పందన లభించింది. దీక్షకు మద్దతుగా సినీనటుడు శివాజీ, మాజీ ఎంపీ శంకరరావు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్సీ వీరభద్రస్వామి, వైసీపీ రాష్ట్ర ప్రతినిధులు మజ్జి శ్రీనివాస్, బి.చంద్రశేఖర్, పులిరాజు, పోతన్న, మన్మథ, విజయ్, రాజేష్, జేఏసీ విశాఖ ప్రతినిధి కిషోర్, ఆర్టీసీ నాయకులు, సాహిత్య అకాడమీ ప్రతినిధి దివాకర్, బీసీ సంక్షేమ నాయకుడు ఆదినారాయణ, దుర్గారావు, రామారావు, అప్పారావు, ఎయిమ్స్ అధినేత ఆనంద్, సీపీఐ రాష్ట్ర నేత కామేశ్వరరావు, సీపీఎం సూరి, గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు, డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు, ఇతర ప్రతినిధులు, లెండి కాలేజ్ యూత్, దళిత సంఘాల నేతలు లోగిస, ఆదాడ, కాంగ్రెస్ నేతలు ఆదిరాజు, భాను, బీఎస్పీ రమణ, ఉపాధ్యాయనేత శివవర్మతోపాటు లోక్‌సత్తా నేతలు, కార్యకర్తలు, ప్రజానీకం పెద్దసంఖ్యలో పాల్గన్నారు. అంతకుముందు ప్రభుత్వ అద్దె వాహనాల డ్రైవర్లు, ఓనర్ల సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ కార్యక్రమంలో బాబ్జీ పాల్గన్నారు. ఇందులో అసోసియేషన్ నేతలు రాము, బి.ఉమ, చంద్రమోహన్, రమేష్, సంతోష్, సీతారాం, చిరంజీవి, రమణ, వెంకటేష్, మురళి, నాయుడు, ప్రకాష్, అప్పారావు, కృష్ణ, శివ, రాంబాబు, శ్రీను, నర్సింగరావు తదితరులు పాల్గన్నారు. విభజన హామీల అమలు, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేకసాయం డిమాండ్ చేస్తూ కొత్తవలసలో కూడా కార్యక్రమం నిర్వహించారు. లోక్‌సత్తా పార్టీ మండల అధ్యక్షుడు ఐతంశెట్టి శ్రీనివాస్, మెడతాన అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనకు వైసీపీ, సీపీఎం, పలు ప్రజాసంఘాలు మద్దతిచ్చాయి. హోదా, ఇతర విభజన హామీలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నామని, హామీల అమలు కోసం లోక్‌సత్తా చేస్తున్న బహుముఖ కృషిలో భాగంగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన అఖిలపక్షాల్లో, ధర్మపోరాట దీక్షలో కూడా పాల్గొని మద్దతును, నిర్మాణాత్మక సూచనల్ని అందించామని బాబ్జీ తెలిపారు.

# ఆర్థిక నియంత్రణ, పర్యవేక్షణ అస్తవ్యస్తం
## -ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కడిగేసిన కాగ్ నివేదిక-



ఆర్థిక నిర్వహణ తీరు నుంచి ప్రభుత్వ రంగ సంస్థల్లో నష్టాల వరకు.. పన్నుల వసూళ్లలో లోటుపాట్ల నుంచి అంచనాలు పెరుగుతూ పోతున్న ప్రాజెక్టుల వరకు పలు అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక కడిగేసింది.

2016-17 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి- నిర్వహణ, రెవెన్యూ వసూలు, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల తీరు తెన్నులు, స్థానిక ప్రభుత్వాలు.. అనేక అంశాలను కాగ్ అధ్యయనం చేసింది. ఈ నివేదికలను ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రవేశపెట్టారు. మొత్తం

### శాసనసభ ఆమోదానికి విరుద్ధంగా ఖర్చులు

2017 మార్చి నెలతో ముగిసిన సంవత్సరానికి కేటాయింపులను మించి ఖర్చు చేసిన సందర్భాలూ, కేటాయించిన నిధులు ఖర్చు కాకుండా భారీగా మిగిలిపోయిన ఉదాహరణలూ ఉన్నాయని కాగ్ నివేదిక తెలిపింది. "గ్రాంటులకు మించి ఖర్చు చేయడం తీవ్ర అతిక్రమణే కాదు.. శాసనసభ అభీష్టానికి విరుద్ధం. మొత్తం 35 పద్దుల కింద 21,967.05 కోట్ల నిధుల్ని ఖర్చు చేయలేదు. అదే సమయంలో ఐదు పద్దుల కింద రూ.1,686.83 కోట్లు అధికంగా ఖర్చు చేశారు. ఈ పరిస్థితుల వల్ల ప్రాథమ్య అంశాలకు నిధుల లభ్యత లేకుండా చేసినట్టయింది. ఆశించిన ఫలితాలు చేకూరేందుకు నిధులు ఇవ్వలేని పరిస్థితికి దారితీసింది. మొత్తం మిగులులో రూ.21,626 కోట్లు (98.45 శాతం) ఆర్థిక సంవత్సరం చివరి రోజున స్వాధీనం చేయడం వల్ల వ్యయ నిర్వహణ సరిగా లేదని, ఆర్థిక నిర్వహణ సక్రమంగా చేయడం లేదని అర్థమవుతోంది. పైగా హడావుడి ఖర్చులు చేస్తున్నారు. నిధులు మురిగిపోకుండా ఉండేందుకు ఖర్చులు ఏడాది పొడవునా సమంగా ఉండాలి. అలాంటిది 19 పద్దులకు సంబంధించి చివరి త్రైమాసికంలో చేసిన ఖర్చు 50 శాతానికి మించి ఉంది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి 2016-17లో రూ.4,370 కోట్ల మేర ఎక్కువ నిధులు సమకూరినప్పటికీ ఆ నిధులతో మూలధన ఆస్తులు ఏర్పడలేదు. రెవెన్యూ ఖర్చులు చేశారు. వచ్చే ఏడేళ్లలో రూ.76,888 కోట్ల మేర రుణాలు చెల్లించాలి. ఇది ఆయా సంవత్సరాల బడ్జెట్‌లపై ప్రభావం చూపుతుంది.

బడ్జెట్‌లో తొలి పద్దు కేటాయింపులు లేని వాటికి కూడా పున:కేటాయింపులు చేశారు. 2016-17లో 86.68 శాతం పునఃకేటాయింపులకు సరైన కారణాలు లేవు. ఆయా ప్రభుత్వ శాఖలకు, ఆర్థికశాఖకు మధ్య సమన్వయం లేదని తేటతెల్లమవుతోంది. అలాగే దాదాపు రూ.501.85 కోట్లకు సంబంధించిన ఖర్చులకు వివరణాత్మక బిల్లులు లేవు. దానివల్ల అసలు ఖర్చు జరిగిందో లేదో కూడా నిర్ధారించడం కష్టం. ఇలాంటి తీరు వల్ల అవినీతి, నిధుల దుర్వినియోగానికి ఆస్కారం ఇచ్చినట్లవుతుంది.

◆ వినియోగ ధృవపత్రాలు (యూసీలు), ఖర్చుల వివరాలు అసంపూర్తిగా ఉన్నాయి.

◆ 2014-16 మధ్య కాలంలో బడ్జెట్ కేటాయింపులకు మించి రూ.53,673.19 కోట్ల అధిక వ్యయాన్ని 2017 నవంబర్ వరకు కూడా క్రమబద్ధీకరించలేదు.

## 1,541 కేసుల్లో లోటుపాట్లు.. రాబడికి గండి

2016-17 ఆర్థిక సంవత్సరంలో పన్ను, పన్నేతర రాబడుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన రూ.607.51 కోట్ల ఆదాయానికి గండి పడిందని కాగ్ తేల్చింది. వాణిజ్య పన్నులు, ఎక్సయిజ్, రవాణా, భూమిశిస్తు, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, ఇతర శాఖలకు సంబంధించి 369 కార్యాలయాల్లో ఫైళ్లను పరిశీలించగా, 1,541 కేసుల్లో లోటుపాట్లు చోటుచేసుకున్నాయని వెల్లడించింది. తక్కువ పన్ను విధింపు, ఆస్తి విలువ తక్కువగా నిర్ధారించటం తదితర అంశాల్లో ఇవి జరిగాయని పేర్కొంది.

◆ డిస్టిలరీల ఉత్పత్తి సామర్థ్యాన్ని నిబంధనలు ఉల్లంఘించి 2,000 లక్షల ప్రూఫ్ లీటర్ల నుంచి 1,000 లక్షల ప్రూఫ్ లీటర్లకు తగ్గించడంతో ప్రభుత్వం రూ.60 కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది.

◆ తక్కువ విద్యుత్ సుంకాన్ని విధించడం, సక్రమంగా వసూలు చేయకపోవడం ఫలితంగా రూ.33.4 కోట్ల మేర ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడింది.

◆ అనంతపురం జిల్లాలోని ధర్మవరం, కల్యాణదుర్గం ఆర్డీవోల అనుమతి లేకుండానే 22 కేసులకు సంబంధించి 119.29 ఎకరాల వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి అందులో లే అవుట్లు వేశారు.

◆ చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉప రవాణా కమిషనర్ల కార్యాలయాలు, గూడూరు, హిందూపురం, నరసరావుపేట, తిరుపతి ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లోని దస్త్రాలను పరిశీలించగా.. 10,20,089 రవాణేతర వాహనాల రిజిస్ట్రేషన్ గడువు 2016 మార్చితో ముగిసినట్టు తేలింది. అయినా యజమానులకు షోకాజ్ నోటీసులను జారీచేసి రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపుపై చర్యలు తీసుకోకపోవడం వల్ల హరితపన్ను రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన రూ.32.85 కోట్ల ఆదాయానికి గండిపడింది.

## 59 శాతం యూనిట్లు ప్రారంభమే కాలేదు

నిరుపేద ఎస్సీలకు జీవనోపాధి కల్పించేందుకు ఉద్దేశించిన ఆర్థిక సహాయ పథకాలు లక్ష్యాన్ని సాధించలేదని కాగ్ పేర్కొంది. వీటి అమలు కోసం ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కార్పొరేషన్ నిరుపేదలైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఎలాంటి సర్వే నిర్వహించలేదని, అర్హుల సమాచారాన్ని సేకరించలేదని ఆక్షేపించింది. తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, చిత్తూరు జిల్లాల్లో పరిశీలన చేయగా ఈ విషయాలు తేలాయని పేర్కొంది. బ్యాంకు అనుసంధానిత పథకాల విషయంలో నిర్దేశించుకున్న లక్ష్యంలో 53 శాతం మాత్రమే సాధించినట్టు వెల్లడించింది. ఎస్సీ కార్పొరేషన్ మంజూరు చేసిన యూనిట్లలో 59 శాతం ప్రారంభమే కాలేదని వివరించింది. జాతీయ షెడ్యూల్ తెగల ఆర్థిక, అభివృద్ధి సంస్థ నుంచి పొందిన రుణాన్ని ట్రైకార్ పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోయిందని తెలిపింది. అభ్యర్థుల దరఖాస్తులను తిరస్కరించిన సందర్భాల్లో వారిని ఎంపిక చేయకపోవడానికి గల కారణాలను కమిటీ నమోదు చేయలేదని వెల్లడించింది.

ఆరు నివేదికలుండగా అయిదింటిని మాత్రమే సమర్పించారు.

రాష్ట్రంలో వ్యయ నియంత్రణ, పర్యవేక్షణ బలహీనంగా ఉన్నాయని కాగ్ పేర్కొంది. హడావుడిగా నిధులు ఖర్చు చేస్తున్నారంది. ఆఖరి త్రైమాసికంలోనే సగానికిపైగా నిధుల్ని ఖర్చు చేసేస్తున్నారని ఆక్షేపించింది. ఆర్థిక వ్యవస్థకు తీరూతెన్నూ లేకుండా పోయిందని తప్పుపట్టింది. ప్రాథమిక విద్యకు మౌలిక వసతులే కరవయ్యాయని, బాలల సంఖ్యపై సరైన మదింపు లేదని తెలిపింది. బడి మానేసే వారి వివరాల్లో ఒక నివేదికకు మరో నివేదికకు పొంతన లేకుండా ఉందని పేర్కొంది. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించడాన్ని అభ్యంతరకరమైనదిగా వ్యాఖ్యానించింది. రాబోయే ఏడేళ్లలో ఏకంగా రూ.76,888 కోట్ల మేర అప్పు చెల్లించాల్సి ఉందని, ఈ భారం బడ్జెట్‌లపై ఎంతో ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ

## భారీ నష్టంలో పీఎస్‌యూలు

రాష్ట్రంలోని 64 ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లు రూ.25,367.89 కోట్ల నష్టాల్లో ఉన్నాయని కాగ్ నివేదిక బైటపెట్టింది.

- ◆ 86 ప్రభుత్వరంగ సంస్థల్లో 2017 మార్చి 31 నాటికి రూ.64,345.31 కోట్ల పెట్టుబడులు (మూలధనం, దీర్ఘకాలిక రుణాలు) ఉన్నాయి. ఈ సంస్థలు రూ.61,972 కోట్ల వ్యాపార పరిమాణాన్ని నమోదు చేశాయి.
- ◆ 60 పీఎస్‌యూల ఈక్విటీపై రాబడి –48.84 శాతం (నష్టం)గా ఉంది.
- ◆ 15 సంస్థలు అక్టోబర్ అక్టోబర్ 2016 – సెప్టెంబర్ 2017 మధ్య రూ.1,164.23 కోట్ల లాభాలను ఆర్జించాయి.
- ◆ ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ తన లెక్కలను లాభనష్టాలులేని పద్ధతిలో తయారుచేసింది.

## విత్తనాభివృద్ధి సంస్థ పనితీరులో లోపాలు

- ◆ 2015–16లో రబీ జేజీ–11 రకానికి చెందిన ధ్రువీకృత శనగ విత్తనాల సేకరణలో ఆలస్యం జరిగింది. దీంతో ధరను మూడుసార్లు సవరించి సేకరణకు రూ.38.24 కోట్ల అధికవ్యయం చేయాల్సి వచ్చిందని కాగ్ తెలిపింది.
- ◆ 3.69 లక్షల క్వింటాళ్ల విత్తనాలను సరైన సమయంలో విక్రయించకపోవడంతో సంస్థకు రూ.25.25 కోట్ల నష్టం వాటిల్లింది.
- ◆ ప్రైవేటు విత్తన ఉత్పత్తి కంపెనీలతో లోపభూయిష్ట ఒప్పందాలు.. రూ.5.16 కోట్ల అనుచిత ప్రయోజనాలకు దారితీశాయి.
- ◆ కేంద్రం వివిధ పథకాల కింద 3.78 లక్షల చదరపు అడుగుల్లో 25 గోదాములను నిర్మించాలని ప్రతిపాదించగా, 2016 మార్చి నాటికి 1.40 లక్షల చదరపు అడుగుల్లో 8 గోదాముల్ని మాత్రమే నిర్మించగలిగింది. ప్రైవేటు గోదాములకు రూ.5.24 కోట్ల అద్దె చెల్లించాల్సి వచ్చింది.
- ◆ 2012–13 నుంచి 2016–17 మధ్య ధ్రువీకృత విత్తనాల ఉత్పత్తిలో నిర్దేశించిన లక్ష్యాలకన్నా 16.40 లక్షల క్వింటాళ్ల లోటు ఉంది.

## ఆర్టీసీ ఆదాయానికి గండి

- ◆ విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ ప్రాంగణంలో ఖాళీ స్థలాన్ని ప్రస్తుత ధరల కన్నా తక్కువ ధరకు నామినేషన్ పద్ధతిపై కేటాయించడంతో ఆర్టీసీకి రూ.91 లక్షల మేర నష్టం వాటిల్లింది.
- ◆ సేవా పన్నుకు సంబంధించిన నిబంధనలు అమలు చేయడం, పన్ను వసూలు చేయకపోవడంతో ఆర్టీసీ రూ.7.46 కోట్ల సేవాపన్ను చెల్లించాల్సి వచ్చింది.
- ◆ బస్సుల కొనుగోలుకు నిర్ణీత కాలరుణాన్ని తీసుకోకుండా స్వల్పకాలిక రుణాలు తీసుకోవడంతో సంస్థపై రూ.4.52 కోట్ల వడ్డీ భారం పడింది.
- ◆ ఔషధాలను టెండర్ల పద్ధతిలో కాకుండా పంపిణీదారుల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేయడంతో ఆర్టీసీ రూ.1.75 కోట్ల అదనపు వ్యయం చేయాల్సి వచ్చింది.

రంగ సంస్థలు నష్టాల్లో కూరుకుపోయి ప్రజాధనం దుర్వినియోగమవుతోందని తెలిపింది.

సాధారణ అంశాల్లో భాగంగా జాతీయ రక్షిత మంచినీటి పథకం, ప్రాథమిక, మాధ్యమిక, సాంకేతిక విద్య తీరుతెన్నులను కాగ్ కూలంకషంగా పరిశీలించింది. తిరుపతి కార్పొరేషన్, రాష్ట్రంలోని ఇతర మునిసిపాలిటీల్లో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన అంశాలను వెలుగులోకి తీసుకొచ్చింది. “ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ గ్రామీణ తాగునీటి పథకంలో రూ.491.83

కోట్ల నిధులు నిష్ఫలమయ్యాయి. రాష్ట్రంలో 271 చిన్న, మధ్య, భారీ తరహా ప్రాజెక్టుల్లో ఏకంగా రూ.28 వేల కోట్లకుపైగా అంచనాలు పెంచేశారు. సకాలంలో ప్రాజెక్టులు పూర్తికాకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. 64 ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాల ఊబిలో కూరుకుపోయాయి. వీటి నష్టం రూ.26,367 కోట్ల మేర ఉంటుంది. ఇదంతా ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయటమే" అని కాగ్ పేర్కొంది.

**మూడు అధ్యాయాలుగా పరిశీలన**

"రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మూడు అధ్యాయాలుగా పరిశీలించాం. మదింపు చేశాం. రాష్ట్ర ప్రభుత్వ వనరులు, వాటి వినియోగాన్ని

### విద్యుదుత్పత్తి సంస్థపై అదనపు భారం

నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్‌కి అనుబంధ పనిని అప్పగించడంతో ఆంధ్రప్రదేశ్ విద్యుదుత్పత్తి సంస్థపై రూ.7.10 కోట్ల అదనపు ఆర్థికభారం పడింది.

### పురపాలక, నగరపాలక సంఘాల నిర్లక్ష్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద కేటాయించిన నిధుల ఖర్చులో పురపాలక, నగరపాలక ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని కాగ్ నివేదిక తప్పుపట్టింది.

- గుంటూరు నగరపాలక సంస్థకు 2016 ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.2.49 కోట్లు కేటాయించగా ఇప్పటివరకూ ఖర్చు చేయకుండా వ్యక్తిగత డిపాజిట్ ఖాతాలో ఉంచారు.
- నరసాపురం పురపాలక సంఘానికి 2016-17లో ప్రభుత్వం కేటాయించిన రూ.10.03 కోట్లలో కేవలం రూ.3.26 కోట్ల పనులకు పాలకవర్గ అనుమతి తీసుకున్నారు. ప్రతిపాదించిన పనులు పూర్తి చేయలేదు.
- భీమవరంలో రహదారుల నిర్మాణానికి కేటాయించిన రూ.36.40 లక్షల్లో కేవలం ఒకే పని కోసం రూ. పది లక్షలు వెచ్చించారు. మిగతా రెండు పనులూ టెండరు దశలోనే ఉన్నాయి. ఎస్సీ నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించిన రూ.2.29 కోట్లతో ప్రతిపాదించిన పనులేవీ పూర్తికాలేదు. ఎస్టీ ఉప ప్రణాళికలో కేటాయించిన రూ.50 లక్షలు ఇప్పటికీ ఖర్చు కాలేదు.
- ప్రొద్దుటూరు, ఆదోని పురపాలనలోనూ తీరు ఇలాగే ఉంది.
- 14వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చులోనూ మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు వెనకబడి ఉండటాన్ని కాగ్ ఆక్షేపించింది.

### రూ.28,036 కోట్లు పెంచేశారు

ఏపీలో సాగునీరు, ఇతర ప్రాజెక్టులు సకాలంలో పూర్తికాకపోవడం వల్ల.. ఎప్పటికప్పుడు అంచనాలు భారీగా పెరుగుతున్నాయని కాగ్ విశదీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన సమాచారం ప్రకారం 2017 మార్చి 31 నాటికి సాగునీటితోపాటు రోడ్లు, వంతెనలు, ప్రజారోగ్యం, పురపాలక ఇంజినీరింగు తదితర శాఖల్లో మొత్తం 271 ప్రాజెక్టులకుగాను ఏ ఒక్కటీ పూర్తికాలేదని నివేదిక పేర్కొంది. 2017 మార్చి 31 నాటికి ఈ ప్రాజెక్టులపై ఖర్చు రూ.54,602 కోట్లు. ఈ పూర్తికాని ప్రాజెక్టులకు సంబంధించి తొలి అంచనాలు పెరిగాయి. దాదాపు 52 శాతం మేర అంటే రూ.28,036.16 కోట్ల మేర ఈ ప్రాజెక్టుల అంచనాలు పెరిగాయి.

- భారీ నీటిపారుదలలో మొత్తం 44 ప్రాజెక్టులను తొలుత రూ.44,107.78 కోట్ల అంచనాలతో ప్రారంభించగా, వాటి అంచనాలు రూ.76,511.52 కోట్లకు పెరిగాయి.
- రోడ్లు, వంతెనలకు సంబంధించి రూ. 217.51 కోట్ల మేర అంచనాలు పెరిగాయి.

◆ పట్టణ ఆర్థిక మౌలిక వసతుల అభివృద్ధి పనుల్లో రూ.269.32 కోట్ల మేర అంచనాలు అధికమయ్యాయి.

◆ భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులు సకాలంలో పూర్తికాకపోవడానికి భూసేకరణ సమస్యలే ప్రధాన కారణంగా సంబంధిత శాఖ పేర్కొంటోంది. వివిధ ప్రభుత్వ శాఖలు స్థలాలు స్వాధీనం చేయకపోవడం, న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు, నిర్మాణ ఆకృతిలో మార్పులు తదితరాల వల్ల పనులు ఆలస్యమవుతున్నాయి.

◆ ఒక్కొక్కదానిపై రూ.కోటికి మించి చేపట్టిన సాగునీటి పనులకు సంబంధించిన ఆర్థిక ఫలితాలను 1985–86 వరకున్న ఫలితాలను 1990–91 పద్దుల్లో పొందుపరిచారు. దేశంలోని అతిపెద్ద ప్రాజెక్టుల్లో కొన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పటికీ 1986–87 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క ప్రాజెక్టుకూ ఆర్థిక ఫలితాలను వెల్లడించలేదని కాగ్ తప్పుపట్టింది.

### రూ.492 కోట్లు నిష్ఫలం

జాతీయ గ్రామీణ తాగునీటి పథకం (ఎన్ఆర్‌డీడబ్ల్యూసీ) కింద చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ వాటిలో ఏడింటిని ప్రారంభించకపోవడం, మరో ఏడు పథకాల నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో రూ.491.83 కోట్ల ఖర్చు నిష్ఫలమైందని కాగ్ పేర్కొంది. పరిశీలన, సర్వే, సవివర ప్రాజెక్టు నివేదికల తయారీ వంటి ప్రాథమిక పనులు పూర్తయినప్పటికీ, పథకాల పనులు ప్రారంభించకపోవడం వల్ల రూ.455.02 కోట్ల మేర కేంద్రసాయాన్ని రాష్ట్రం వినియోగించుకోలేక పోయిందని తెలిపింది.

### ఆక్రమణ చెరలో 431 ఎకరాలు

రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో రూ.125.45 కోట్ల విలువైన 431.98 ఎకరాల పంచాయతీరాజ్ భూములు ఆక్రమణల్లో ఉన్నాయని కాగ్ నివేదిక వెల్లడించింది. పంచాయతీ రాజ్ సంస్థల్లో భూ నిర్వహణపై 2014–17 మధ్య ఏడు పరిషత్‌లు, 35 మండల పరిషత్‌లు, 70 గ్రామ పంచాయతీల్లో కాగ్ తనిఖీలు నిర్వహించింది. ప్రభుత్వం నుంచి నిర్దిష్ట ఆదేశాలున్నా.. సర్వే సంఖ్య, వాస్తవ భూ విస్తీర్ణం, భూమి విలువ మొదలైన వివరాలతో కూడిన ఆస్తుల రిజిస్టర్‌ను నిర్వహించలేదని ఆక్షేపించింది. సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాల రక్షణకు పంచాయతీ రాజ్‌లో ఎలాంటి పర్యవేక్షణ వ్యవస్థా లేదని తెలిపింది. ఫలితంగా ఆక్రమణలు పెరుగుతున్నాయంది. స్థలాలు, దుకాణాలు లీజుకిచ్చేటప్పుడు నిబంధనలను పాటించనందున రెవెన్యూ నష్టంతోపాటు అనధికార నిర్మాణాలు పెరిగాయంది.

◆ సిబ్బంది కొరత, ఉన్న సిబ్బందికి శిక్షణ లేకపోవడం వల్ల భూ రికార్డుల సంరక్షణ, ఆక్రమణల తొలగింపులో జాప్యం జరుగుతోంది.

◆ జిల్లా స్థాయిలో ఆక్రమణలను గుర్తించి తొలగించటాన్ని సమీక్షించేందుకు ఉన్నత అధికారుల కమిటీ ఉండాలి. మూడు జిల్లాల్లో కమిటీ ఊసే లేదు.

◆ గ్రామ పంచాయతీల ఆస్తుల పరిరక్షణ, జిల్లా స్థాయి కమిటీ కార్యకలాపాల పర్యవేక్షణకు కమిషనరేట్ స్థాయిలో నిఘా, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు చేయాల్సి ఉన్నా ప్రస్తావన లేదు.

విశ్లేషించి విపులీకరించాం” అని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) టుచావాంగ్ వెల్లడించారు. బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలు వివిధ శాఖలకు కేటాయించిన నిధులను నిర్వహించిన తీరును విశ్లేషించామన్నారు.

**నీటి ఆధారం లేకుండా నిర్మాణం**

జాతీయ గ్రామీణ నీటి సరఫరా పథకం కింద రాష్ట్రంలో ఏడు పథకాలను నిర్మించినా ప్రారంభించలేకపోయారని కాగ్

## సర్వశిక్షా అభియాన్‌లో నిధుల మళ్లింపు

సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఇతర కార్యక్రమాలకు మళ్లించారని, అడ్వాన్స్ రూపంలో ఇచ్చినవాటికి ఇప్పటికీ లెక్కలు చూపలేదని కాగ్ ఎత్తిచూపింది. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు తగ్గిందని, విద్యా నాణ్యత ప్రైవేటు బడుల్లో కంటే తక్కువగా ఉందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం వ్యయవివరాలు, వినియోగపత్రాల సమర్పణలో జాప్యం చేసిన కారణంగానే 2016-17లో కేంద్ర ప్రభుత్వం తన వంతు వాటాగా విడుదల చేయాల్సిన నిధుల్లో 37.13 శాతం కోత విధించినట్టు గుర్తించామని తెలిపింది.

- పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేందుకు ప్రభుత్వం బడిబాట, బడి పిలుస్తోంది, మన ఊరు-మనబడి వంటి కార్యక్రమాలను నిర్వహించినా విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) తగ్గిపోతోంది. ప్రాథమిక తరగతులకు సంబంధించి 2010-11లో 91 శాతంగా ఉన్న జీఈఆర్ 2016-17లో 83 శాతానికి తగ్గిపోయింది. ఇదే సంవత్సరాల్లో ప్రాథమికోన్నత స్థాయిలో 77 శాతం నుంచి 81కి పెరిగింది. పిల్లలు అసలు చేరని ప్రాథమిక బడులు 2015-16లో 176 ఉండగా, 2016-17లో అది 438కి పెరిగింది. ప్రాథమికోన్నత స్థాయిలో 327 నుంచి 506కి పెరిగింది.
- 2016-17లో 1,014 ప్రాథమిక, 37 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులే లేరు. బడి మానేస్తున్న పిల్లల సంఖ్య విషయంలో పాఠశాల విద్యాశాఖ, ఎస్ఎస్ఏ నివేదికలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి.
- ప్రాథమిక విద్యను పూర్తి చేసినవారిలో 57 శాతం మంది మాత్రమే రెండవ తరగతి పాఠ్యపుస్తకాన్ని చదవగలుగుతున్నారు.

## సర్వేపై పాఠశాల విద్యాశాఖ అలసత్వం

విద్యాహక్కు చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు విద్యార్థులను గుర్తించేందుకు రాష్ట్రంలో కుటుంబ సర్వే నిర్వహించడం లేదు. ఆవాస ప్రాంతం నుంచి కిలోమీటరు దూరంలో ప్రాథమిక, మూడు కిలోమీటర్ల దూరంలో ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండేలా మ్యాపింగ్ చేయటంలోనూ జాప్యమే జరుగుతోంది. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులను గుర్తిస్తే కేంద్రం రవాణా నిధులను మంజూరు చేస్తుందని తెలిసినా గుర్తింపు ప్రక్రియలో నిర్లక్ష్యమే కొనసాగుతోంది.

## కాగ్ నివేదికపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి: లోక్‌సత్తా

రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా ఉందని, ఆర్థిక నిర్వహణ బలహీనంగా ఉందని, ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని కాగ్ ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. కాగ్ కడిగిపారేసినా రాష్ట్ర ప్రభుత్వం దులిపేసుకున్నట్టు వ్యవహరించటం బాధ్యతారాహిత్యమన్నారు. ప్రభుత్వ శాఖలు అధికారికంగా ఆమోదించిన లెక్కలనే కాగ్ చెబుతుందని గుర్తుచేశారు. ప్రజల పట్ల ప్రేమ, దీర్ఘకాలిక దృష్టి లేకపోతే.. రాజకీయాల్లో అపార అనుభవం కలిగిన నేత పాలనయినా అధ్వాన్నంగానే ఉంటుందని కాగ్ నివేదిక రుజువు చేస్తోందన్నారు. కాగ్ నివేదికపై ప్రభుత్వం నిర్మాణాత్మకంగా స్పందించటం రాష్ట్రానికి రాబోయే కాలంలోనైనా మేలుచేస్తుందన్నారు.


తెలిపింది. నీటి ఆధారం లేకపోవటమే ఇందుకు కారణమని వివరించింది. మరో ఏడు మధ్యలోనే ఆగిపోయి రూ.491.83 కోట్లు వృథా అయ్యాయంది.

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో అనేక లోటుపాట్ల వల్ల రూ.697.51 కోట్ల ఆదాయానికి గండిపడింది. దాదాపు 369 కార్యాలయాల్లో తక్కువ పన్ను విధింపు, ఆస్తి విలువ తక్కువగా నిర్ధారించటం, తదితర కారణాల వల్ల ఈ నష్టం వాటిలిందని కాగ్ పేర్కొంది.

# అమర్యాదలో భావసారూప్యం

- పర్వతం మూర్తి





రాజకీయాలన్నవి నేతాగణాలకే వదిలేయాల్సినంత సాదాసీదా వ్యవహారాలు కావన్న సంగతి తనకు తెలిసి వచ్చిందని ఫ్రాన్స్ అధ్యక్షుడిగా పనిచేసిన ఛార్లెస్ డిగాల్ ఓ సందర్భంలో వ్యాఖ్యానించారు. ఎనభై అయిదు కోట్ల మంది ఓటర్లతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో- రానురాను రాజుగారి గుర్రం గాడిదైందన్నట్లుగా రాజకీయాలు దిగజారిపోవడానికి ప్రజల ఉదాసీన ధోరణులూ పుణ్యం కట్టుకొంటున్నాయని చెప్పక తప్పదు! సమకాలీన రాజకీయపక్షాల్లో భాజపా విలక్షణమైనదని వాజ్‌పేయీ, అద్వానీల ప్రభ వెలుగుతున్న కాలంలో కమలనాథులు సగర్వంగా చెప్పుకొనేవారు. రాజకీయాల్లో మర్యాదాసంక్షోభం నెలకొంటోందని భారత ప్రధానిగా వాజ్‌పేయీ సైతం వాపోయారు. 11 కోట్ల మంది కార్యకర్తలతో ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించిన భాజపా నేడు 330 మంది ఎంపీలు, 1600 మంది ఎమ్మెల్యేలతో అలరారుతున్నా దానికింకా స్వర్ణయుగం రావాల్సి ఉందన్న పార్టీ అధ్యక్షుడు అమిత్ షా నోట అలవోకగా జారిపడ్డాయి కొన్ని ఆణిముత్యాలు. భారీ వరదల నుంచి ప్రాణ రక్షణ కోసం పాములు, ముంగిసలు, కుక్కలు, పిల్లులు, చిరుతలు, సింహాల వంటివన్నీ జాతి వైరం మరచి ఏ మర్రిచెట్టో ఎక్కేసినట్లు- ప్రతిపక్ష పార్టీలు సైతం సరిగ్గా ఆ జంతువుల్లాగే కలుస్తున్నాయని గొప్పగా సెలవిచ్చారు. మోదీ భయంతో భావ సారూప్యత లేని పార్టీలు కలుస్తున్నాయన్నదే తన ఉద్దేశమని వివరణ దయచేసినా- విపక్షాల్ని పాములు, కుక్కలతో పోల్చడం ఏమిటసలు? గతంలో రాజీవ్‌గాంధీ తనకు వ్యతిరేకంగా కూటమికట్టి ఒక్క తాటిపైకొచ్చిన విపక్షాల్ని తేళ్లు, జెర్రులతో పోలుస్తూ ప్రధాన వార్తాపత్రికల్లో పూర్తిపేజీ ప్రకటనలే ఇచ్చారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ కోల్పోతున్న స్థానాన్ని భర్తీ చేస్తామంటూ దూసుకొచ్చిన కమలనాథులు- మర్యాదల్ని అతిక్రమించడంలో, నోటి దురుసుతనం ప్రదర్శనలో హస్తం పార్టీకి ప్రతిరూపంగానే సాక్షాత్కరిస్తున్నారు!

'తప్పు చెయ్యడం మానవ సహజం. దానికి వేరెవరో కారణమనడమే రాజకీయం' అన్న హ్యూబర్ట్ హమ్‌ఫ్రే సూత్రీకరణ నూరుపాళ్లు నిజం. పాము ముంగిసల్లాంటి ఎస్పీ-బీఎస్పీ, తృణమూల్-కాంగ్రెస్, చంద్రబాబు-కాంగ్రెస్ కలిసి ఉండలేరంటూ భావసారూప్యత ఏదన్న అమిత్ షా ప్రశ్నలోనే ఇమిడిఉంది రాజకీయం. అమిత్ షా ప్రస్తావించిన భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేల్లో కమలం పార్టీ నుంచి ఎదిగొచ్చిన వారెంతమంది, వేరే పార్టీల నుంచి ఫిరాయింపులతో ఎగిరొచ్చి అవసరార్థం తీర్థం పుచ్చుకొని ప్రజాప్రతినిధులుగా చక్రం తిప్పుతున్న వారెంతమంది? అరుణాచల్ ప్రదేశ్ లాంటి చోట్ల మొత్తం ప్రభుత్వమే భాజపా గూటికి ఫిరాయించడంలో ఏ భావసారూప్యం దాగుంది? తమిళనాట పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే డీఎంకే, ఏఐడీఎంకే రెండింటితోనూ కేంద్రంలో భాజపాకు భావసారూప్యం ఎలా సాధ్యపడింది? ఆయా

కాలమాన పరిస్థితులు, సందర్భావసరాల్ని బట్టి భావసారూప్యం అర్థతాత్పర్యాలు మారిపోవడం భారత రాజకీయాల్లో అందరికీ తెలిసిన పెడ పోకడే. తాను చేస్తే లౌక్యం, ఎదుటివాళ్లు చేస్తే మోసం అన్నట్లు విమర్శలు రువ్వడం రాజకీయాల్లో సహజమే అనుకొన్నా- దుర్భాషకు తెగబడి మర్యాదను అతిక్రమించడం భాజపాకు విలక్షణతను దూరం చేసేదే!

చైనా కన్నేసిన ఆక్సాయ్‌చిన్ ప్రాంతంలో వచ్చగడ్డి అయినా మొలవదని, దానిపై విపక్ష సభ్యుల ఆందోళన అర్థరహితమన్న నెహ్రూ వాదనను పార్లమెంటులో తోసిపుచ్చుతూ- 'నా బట్టతల మీద కూడా వెంట్రుక మొలవదు... దీన్నీ శత్రువులకు అప్పగిద్దామా' అన్న మాన్య సభ్యుడి చురకత్తిలాంటి ప్రత్యుత్తరంతో అంతటి నెహ్రూ కూడా నీళ్లు నమలాల్సి వచ్చింది. స్వతంత్ర పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన పీలూమోదీని ఇందిర 'వాషింగ్టన్ ఏజెంటు'గా తూలనాడిన సందర్భంలో ఆయన 'నేను సీఐఏ ఏజెంటును కాను' అని పెద్ద బ్యాడ్జీ పెట్టుకొని పార్లమెంటుకు హాజరయ్యారు. దాన్ని తీసేయమన్న సభాపతి ఆదేశాన్ని మన్నిస్తూ, 'నేను ఇంకేమాత్రం సీఐఏ ఏజెంటును కాను' అని పీలూమోదీ చేసిన వ్యాఖ్యలు వాతావరణాన్ని ఆహ్లాదభరితం చేశాయప్పుడు. ప్రభుత్వపరంగా పెడసరపు స్పందన వచ్చినా, వ్యంగ్య బాణాలతో వాటిని చీల్చిచెండాడి, వ్యక్తిగత దూషణ తిరస్కారాలకు ఏమాత్రం పాల్పడకుండానే పాలకుల మెడలు వంచిన పార్లమెంటరీ దిగ్గంతుల శకం అంతరించింది. నేరగాళ్లకు రిజర్వేషన్లు ఇచ్చినట్లుగా పార్టీలన్నీ కట్టగట్టుకొని నిష్ఠగా అలాంటి సరకును ఏరికోరి చట్టసభలకు నెగ్గిస్తుండటంతో- వ్యక్తిగత దూషణలే కాదు, బూతుల పంచాంగ శ్రవణాలూ కర్ణకఠోరంగా వినిపిస్తున్నాయి. ఏప్రిల్ 20న పుట్టిన చంద్రబాబు- 420 అని ఆయన ఏదైనా బావిలో దూకితే రాష్ట్రానికి పట్టిన శని వదులుతుందని ఏపీ విపక్ష నేత జగన్ తిట్లపురాణం లంకించుకున్నారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేయదన్న నానుడిని రూఢి చేస్తూ వైకాపా ఎంపీ ఇటీవలే నెలబారు వచోవిభవ ప్రదర్శనకు తెగబడ్డారు. సార్వత్రిక ఎన్నికల సీజన్ ఏడాది వ్యవధిలోకి రావడంతో ఈ తరహా కారుకూతలు రాజకీయ మర్యాదను ఏ పాతాళపు లోతులకు ఈడ్చుకుపోతాయో చెప్పగల నాథుడు లేడు!

యుద్ధంలో ఒకసారే మరణిస్తాం, అదే రాజకీయాల్లో చస్తూనే ఉంటామన్న విన్‌స్టన్ చర్చిల్ మాట ఎంత యదార్థమో పార్టీ భేదాలకు అతీతంగా సంస్కారహీన వాగాడంబరాన్ని గమనిస్తే బోధపడుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ నీచమైన వ్యక్తి అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ మొన్న డిసెంబరు మొదటివారంలో చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి అయ్యర్‌ను సస్పెండ్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఆయనకు షోకాజ్ నోటీసూ జారీ చేసింది. జమ్మూ కశ్మీరుకు చెందిన మరో కాంగ్రెస్ నేత సల్మాన్ నిజామి- రాహుల్ గాంధీకి మోదీకి పోలిక చెప్తూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. 'మోదీ ఎవరి కొడుకు, ఎవరి మనవడు, ఏం త్యాగం చేశారు' వంటి చౌకబారు ప్రశ్నలతో లేకిబుద్ధుల్ని ఎండగట్టుకున్న అలాంటి నేతల చిట్టా చిన్నదేమీ కాదు. అసలు ఎన్నికలు కనుచూపు మేరలోకి వచ్చాయంటేనే రాజకీయ కాక పెరిగి సంధి ప్రేలాపనలు జోరెత్తుతుంటాయి. హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల వేళ కాంగ్రెస్‌ను చెదపురుగులతో పోల్చి దాన్ని పూర్తిగా తుడిచి పెట్టేయాలని మోదీయే పిలుపునిచ్చారు. 2007 గుజరాత్ ఎన్నికలప్పుడు మోదీని 'మృత్యుబేహారి'గా సోనియా తూలనాడారు. బిహార్ ఎన్నికల్లో అప్పటికి ప్రత్యర్థిగా ఉన్న నితీశ్ 'డీఎన్ఏ'ను ప్రశ్నించిన మోదీ, కాంగ్రెస్ నేత శశిథరూర్ భార్యను 'రూ.50 కోట్ల గర్ల్ ఫ్రెండ్'గా ఎక్కసెక్కాలాడారు. సమున్నత పదవీ గౌరవాలే పలుచన అయ్యేలా అగ్రనేతల ఈ తరహా వాచాలత్వమే ద్వితీయ శ్రేణి గణాలకు పూనకం తెప్పిస్తోందనడంలో సందేహం లేదు.

పచ్చగా ఉన్నచోట తిని వెచ్చగా ఉన్నచోట పడుకొనే శీలహీన రాజకీయాల ఉరవడిలో కొట్టుకుపోతున్న నేతలంతా గురివెందలకు గురుపాదులే. మర్యాద తాలూకు మౌలిక లక్ష్మణ రేఖల్ని అతిక్రమిస్తే మిగిలేది అరాచకమే. ప్రత్యర్థుల్ని పడతిట్టిపోసి అధికార పరమపద సోపానపటంలో పైపైకి పోగలమనుకుంటున్న నేతలు ప్రజాస్వామ్య విలువలకు అక్షరాలా తలకొరివి పెడుతున్నారు. మర్యాదస్తుల క్రీడగా రాజకీయాల్ని రూపాంతరీకరించే చొరవ ఎప్పుడైనా అత్యున్నత స్థాయి నుంచే మొదలవ్వాలి. అగ్రనేతలే స్థిమితం కోల్పోయి పరస్పరం అమర్యాదకర భాషణలో భావసారూప్యం చాటుకోవడం- భారతావనికి సిగ్గుచేటు. ఏమంటారు?

(ఈనాడు సౌజన్యంతో)

# పౌర సేవల హక్కు చట్టం తేవాలి

**-సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి-**

హక్కుగా పౌర సేవల్ని అందించే చట్టాన్ని తెలంగాణలో తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి అన్నారు. అధికారుల్లో అవినీతి, అలసత్వాన్ని అరికట్టడానికి, ప్రభుత్వ సేవలను ప్రజలకు సకాలంలో అందించడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. 'పౌర సేవల' చట్టం ఆవశ్యకతను వివరిస్తూ అన్ని రాజకీయ పార్టీలూ మార్చి 19, 2018న లేఖ రాస్తే ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. అధికారులు జవాబుదారీగా ఉండి ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు సక్రమంగా జరిగినప్పుడే బంగారు తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ఇప్పటికైనా సరైన చట్టాన్ని తెచ్చి పౌర సేవల్లో దేశానికే ఆదర్శంగా నిలవాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాసిన లేఖలో చాడ విజ్ఞప్తి చేశారు. పౌర సేవల చట్టం కోసం 1997 నుంచి కృషి చేస్తున్న లోక్‌సత్తా.. తెలంగాణ ప్రభుత్వానికి కూడా 2016 అక్టోబర్‌లో చట్టం నమూనాను పంపటం, ప్రజల్లో చైతన్యాన్ని పెంచుతూ, చట్టం కోసం అన్ని పార్టీల మద్దతునూ కూడగడుతుండటం తెలిసిందే.

# అక్రమ వాటర్‌ప్లాంట్లపై లోక్‌సత్తా ఫిర్యాదు




రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్, జిల్లెలగూడ, జల్‌పల్లి మునిసిపాలిటీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ వాటర్‌ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా నేతలు డిమాండ్ చేశారు. నియోజకవర్గ లోక్‌సత్తా ఇంఛార్జి తోడేటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయా మునిసిపాలిటీల్లో కమిషనర్లకు ఈ మేరకు ఫిర్యాదులు చేశారు. ప్లాంట్ల ద్వారా అక్రమార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్న పలువురు.. వాల్టా చట్టాన్ని బేఖాతరు చేస్తూ వందల ఫీట్ల లోతు బోర్లు వేసి భూగర్భ జలాలను తోడేస్తున్నారని వివరించారు. దీనివల్ల బోర్లు ఎండిపోయి ప్రజలు తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు ఇజాజ్, వినయ్ కుమార్, సుప్రభాత్, సాయికుమార్, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావేదిక నూతన కమిటీ

రాయదుర్గం నియోజకవర్గంలో ప్రజావేదికకు సంబంధించిన నూతన కమిటీని ఎన్నుకున్నట్టు ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి సహాయకుడు నాగరాజు తెలిపారు. నియోజకవర్గం కన్వీనర్‌గా వెంకటరమణ బాబు, ప్రధాన కార్యదర్శిగా బోయ మల్లికార్జున, గౌరవ అధ్యక్షుడుగా ఈశ్వరయ్య ఎంపికైనట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. సమాజంలో, పాలనలో మార్పు కోసం పార్టీలకతీతంగా ప్రజావేదికను ఏర్పాటుచేశామన్నారు. పట్టణ, మండల, గ్రామ స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటవుతున్నాయన్నారు. ప్రజావేదిక ప్రతినిధులు ఉలిగప్ప, గౌరవ శ్రీనివాసులు, ఫణిభూషణ్, గోవిందు, గోపి, తిమ్మరాజు, లోకేష్, మురళీమోహన్, హొన్నబీ, తిప్పేస్వామి, రుద్రప్ప, చిక్కణ్ణ, లోకేష్, రవి, పైతోట చంద్ర తదితరులు పాల్గొన్నారు.



అన్నారు. 1/3, 1/4 భిన్నాల్లో ఏది పెద్దది అనే ప్రశ్నకు పలువురు విద్యార్థినులు జవాబు చెప్పలేకపోవటం పట్ల ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థుల తెలివితేటల్లో లోపం లేదని, కానీ మనం అందించే చదువులో చాలా పెద్ద లోపముందని, దీన్ని గుర్తించకపోతే కొన్ని తరాల పాటు మళ్లీ నష్టపోవాల్సి ఉంటుందని అన్నారు. డిగ్రీలు వచ్చినంత మాత్రాన నిజమైన విద్య కాదని, అందువల్ల మార్కులకన్నా.. నేర్చుకోవటం మీద విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. ఉపాధ్యాయుల వెంటపడి విషయాల్ని

# ఆత్మన్యూనతతో ఆలోచించొద్దు, మొల్లలాంటి విజేతల్ని స్ఫూర్తిగా తీసుకోండి

నాలుగు వందల సంవత్సరాల కిందట కవుల మధ్య పోటీ ఉన్న రోజుల్లో జిల్లాలోని గోపవరం గ్రామానికి చెందిన కవయిత్రి మొల్ల మొట్టమొదటిగా తెలుగులో రామాయణం రచించి పేరు ప్రఖ్యాతులు పొందారని, అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యాభ్యాసం చేయాలని జేపీ సూచించారు.

కడప జిల్లా బద్వేలులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సురాజ్య యాత్రలో భాగంగా జేపీ సందర్శించారు. విద్యార్థినుల సామర్థ్యాన్ని, అభిప్రాయలను తెలుసుకునేందుకు కాసేపు లెక్కల్ని బోధించారు. పలు స్థానిక అంశాలను, సమస్యలను ప్రస్తావించారు. భోజనాలు ఎలా పెడుతున్నారు, పౌష్టికాహారం, పారిశుద్ధ్యం ఎలా ఉంది తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

లక్ష్యాలు ఉన్నతంగా ఉంటూ క్రమశిక్షణతో వ్యవహరిస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటేనే విద్యార్థులు మంచి ఆదాయాన్ని, వికసించిన జీవితాన్ని పొందగలరని జేపీ అన్నారు. ఆత్మన్యూనతతో తక్కువ స్థాయి లక్ష్యాలను ఏర్పరచుకోవద్దన్నారు. మొల్లలాంటి విజేతల్ని మార్గదర్శకులుగా తీసుకోవాలన్నారు. సామాన్య, దిగువ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చినవారిలో పలువురు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారని, ప్రభుత్వ విద్యను గనక బాగుచేస్తే కోట్లమందికి మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని జేపీ అన్నారు. అందుకోసమే సురాజ్య యాత్రను చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పుడు చేస్తున్న ఖర్చు కంటే కూడా తక్కువ ఖర్చుతోనే అందరికీ మంచి విద్య సాధ్యమన్నారు. నిధుల వినియోగం చేసే పద్ధతుల్లో కొన్ని మార్పుల్ని తేవాల్సుందన్నారు.

విద్యార్థులకు అందించే విజ్ఞానమే గొప్ప సంపదని, ఈ బాధ్యతను ఏ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలూ విస్మరించకూడదని జేపీ నేర్చుకుంటుండాలన్నారు. నేర్చుకున్న విషయాన్ని పరీక్షించటం, మన చుట్టూ ఉన్న సమాజంలో సమస్యల పరిష్కారానికి ఉపయోగించటం వస్తే.. చదువు వచ్చేసినట్టేనన్నారు. రైతులు ఎంతో కష్టపడి పంటల్ని పండిస్తున్నా, ఆ పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా ఎందుకు రైతులకు మాత్రం సరైన ధరలు రావటంలేదో గుర్తించాలన్నారు. ఇలాంటి సమస్యల్ని పరిష్కరించే సామర్థ్యం చదువుతో రావాలన్నారు. మనం నేర్చుకున్న చదువు మనతోపాటు పదిమందికీ ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఇలా వచ్చిన చదువు.. ఎవరూ దొంగిలించలేని గొప్ప సంపదన్నారు. దీన్ని నిరంతరం పెంపొందించుకుంటూ ఇంకా సంపన్నులుగా తయారవుతుండాలన్నారు.

పేదరికం పోవాలన్నా, ఎక్కువ కులం తక్కువ కులం వంటివి తొలగిపోవాలన్నా, వ్యవసాయంలో లాభాలు రావాలన్నా మంచి చదువు ముఖ్యమని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సురాజ్య ఉద్యమంలో పాఠశాల విద్యార్థులు కూడా భాగస్వాములు కావొచ్చని జేపీ సూచించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ ఈ సందర్భంగా సమాధానాలిచ్చారు.

పాఠశాల ప్రిన్సిపల్ సుభాషిణి, ఉత్తమ్‌రెడ్డి, పీఏసీ నేత మారంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, బండారు రామ్మోహనరావు, ఇతర లోక్‌సత్తా నేతలు, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంకా నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వాసుపత్రుల్లో మంచి వైద్యులే ఉండరు: జేపీ హెచ్చరిక



ప్రపంచంలో ఏ దేశంలో లేనంత నిర్లక్ష్యాన్ని వైద్యరంగం పట్ల మన ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్నాయని జేపీ అన్నారు. విదేశాలు తమ జాతీయ ఆదాయంలో 7 నుంచి 9శాతం దాకా ఖర్చు చేస్తుంటే, మనదేశం కేవలం 1.1శాతం ఖర్చు చేస్తోందన్నారు. అంటే నూరు రూపాయల ఆదాయానికి కేవలం రూపాయి పది పైసలు మాత్రమే ఆరోగ్యం కోసం వెచ్చిస్తోందన్నారు. ఇందులోనే ఎయిడ్స్ వంటి వాటికి వైద్యం, టీకాలు వంటివి ఉన్నాయన్నారు. కేంద్రం బాటలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా వైద్య ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, ఇప్పుడు ఫలితాలు లేకుండా ఖర్చు చేస్తున్న రూ.1700కోట్లను మళ్లించినా అందరికీ మెరుగైన ఆరోగ్యాన్ని అందించవచ్చని అన్నారు. ముమ్ముందు ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేయటానికి సరైన వైద్యులు కూడా ముందుకు రాని విధానాన్ని ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని, అప్పుడు ప్రజారోగ్యంలో నెలకొనే సంక్షోభాన్ని ఎదుర్కొనే శక్తి ఏ పాలకులకూ ఉండదని హెచ్చరించారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో అనంతపురం జిల్లా కదిరి ఏరియా ఆస్పత్రిని జయప్రకాష్ నారాయణ్ సందర్శించారు. వైద్యులతో, రోగులతో మాట్లాడారు.

కదిరి ఏరియా ఆస్పత్రిలో తొమ్మిది మంది వైద్యులు మాత్రమే ఉన్నారని, రోజుకు ఒక్కో వైద్యుడు 120మంది ఔట్‌పేషెంట్లతోపాటు శస్త్రచికిత్సలు, అత్యవసర సేవలు చూడాల్సి వస్తోందని జేపీ అన్నారు. ఆస్పత్రి నిర్వహణకు కేవలం రూ.5.5కోట్లు కేటాయిస్తున్నారన్నారు. ఇవే సేవల్ని ఓ సాధారణ ప్రైవేటు ఆస్పత్రిలో అందిస్తే, రూ.20 కోట్ల దాకా ఖర్చవుతాయన్నారు. కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిలో 70 కోట్లయినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. ఎంబీబీఎస్ చదవటం, ఆపైన స్పెషాలిటీ కోర్సు చేయటం ఆషామాషీ వ్యవహారం కాదని, ఇంత చదివి ప్రాణాల్ని కాపాడే వృత్తిలోకి వచ్చిన వైద్యులకు ప్రభుత్వం ఆఫర్ చేస్తున్న నెల జీతం రూ.40,000–50,000 మాత్రమేనని అన్నారు. ఇదే ప్రైవేటు ఆస్పత్రుల్లో నాలుగైదు లక్షల వరకూ ఉందన్నారు. విశాఖపట్నంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో అరుదైన స్పెషాలిటీ వున్న ఓ వైద్యుడు 14 ఏళ్లు పనిచేస్తే పదోన్నతి ఇవ్వకపోగా నెలకు రూ.60,000 జీతం ఇస్తున్నారన్నారు.

అలాగే ఒక్కో బెడ్‌కి కదిరి ఆస్పత్రిలో చేస్తున్న ఖర్చు ఏడాదికి రూ.4లక్షల వరకు (భోజనం సహా ఖర్చులన్నీ కలిపి) ఉందని, ఇదే ఖర్చు ప్రైవేటు రంగంలో మూడు రెట్లు అధికంగా ఉందని జేపీ అన్నారు. ఇంత కటకట మధ్య కూడా వచ్చిన రోగుల్ని తిప్పి పంపకుండా నేల మీదో, వరండాలోనో ఉంచి వైద్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అయితే ఇది ఎల్లకాలం ఇలాగే సాగితే చివరకు సమర్థవంతులైన డాక్టర్లులేక శిథిలమయ్యే ప్రభుత్వాసుపత్రులే మిగులుతాయని అన్నారు. రోగులను అటెండ్ అయ్యే క్రమంలో డాక్టర్లకు బీపీలు, గుండెజబ్బులు పెరగటాన్ని స్వయంగా చూశానన్నారు. ప్రైవేటు రంగంలో కంటే ప్రభుత్వ రంగంలో వైద్యం చేయటం ద్వారా సమాజానికి సేవ చేసే అవకాశముంటుందని వచ్చే వారు కూడా పారిపోయేలా ప్రభుత్వ విధానాలున్నాయన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్ని మెరుగుపరిచి ప్రజలకు ఖర్చు లేకుండా మంచి వైద్యాన్ని అందించటం పెద్ద ఖర్చు లేకుండానే సాధ్యమని జేపీ అన్నారు. సురాజ్య యాత్రలో భాగంగా అన్ని ఆస్పత్రుల్నీ నిశితంగా పరిశీలించి సవివరంగా తెలుసు

**ఆ 50 లక్షలమందిని చూసి బాధపడనా?**

**ఇప్పటికైనా ఇచ్చారని సంతోషించనా?**

గర్భంలో ఉన్నప్పుడు బిడ్డలకు వచ్చే గుండెవ్యాధి నివారణకు తల్లికి ర్యుబెల్లా టీకా ఇవ్వాలని తాను 20ఏళ్లపాటు పోరాడితే ఎట్టకేలకు ఇటీవల ప్రారంభించారని జేపీ తెలిపారు. దేశవ్యాప్తంగా కేవలం 50కోట్లు ఖర్చు చేస్తే ఈ టీకాను ఇవ్వొచ్చన్నారు. ఇకనైనా ఈ టీకా ఇస్తున్నారు అని సంతోషించనా, లేక పరిష్కారం చెబుతున్నా పట్టించుకోని మన ప్రభుత్వాల మూర్ఖత్వం వల్ల గత 20ఏళ్లలో సుమారు 50లక్షలమంది ఆ వ్యాధితో పుట్టారని బాధపడనా? అని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రతి ఒక్కరికీ ఫ్యామిలీ డాక్టర్ సేవలు ఉచితంగా అందుబాటులో ఉండాలి,**

**ఆరోగ్యశ్రీ డబ్బుతోనే ఈ పనిచేయవచ్చు**


ఏ పేషెంట్ ఏరియా ఆస్పత్రికి లేదా ఆ పై ఆస్పత్రికి వెళ్లాలో చెప్పటానికి దిగువస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఏర్పాటు చేయాలని జేపీ అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఎంబీబీఎస్ వైద్యుల్లో మెరుగైన అవకాశాలు లేకుండా ఉన్నవారికి శిక్షణనిచ్చి ఈ డాక్టర్లుగా అందుబాటులోకి తేవచ్చన్నారు. వీరిలో తమకు ఫ్యామిలీ డాక్టర్‌గా ఎవరిని ఎంచుకోవాలో ఏరియా వారీగా ప్రజలకు స్వేచ్ఛనివ్వాలన్నారు. ఎంతమంది ప్రజలు ఎంచుకుంటే అంత డబ్బును సంవత్సరం ఫీజుకింద ప్రభుత్వం చెల్లిస్తుందని, దీనివల్ల క్లినిక్ నిర్వహణ ఖర్చులు పోగా, కనీసం ఏడాది రూ. 8-10 లక్షల వరకూ ఎంబీబీఎస్ వైద్యులు ఆదాయం పొందే అవకాశముందన్నారు. ప్రజలకు ఓ డాక్టర్‌ను ఉచితంగా అందుబాటులో పెట్టటం, వీరి రిఫరెన్స్‌తోనే పైస్థాయి ఆస్పత్రికి రోగులు వెళ్లే ఏర్పాటు (ఎమర్జెన్సీ కేసులైతే నేరుగా ఏ ఆస్పత్రిలోనైనా అడ్మిట్ అవ్వచ్చు) చేయటం, బోధనాస్పత్రి వరకూ పైస్థాయి ఆస్పత్రుల్ని బలోపేతం చేయటం వల్ల రాష్ట్రంలో వైద్య సేవలు ప్రజలపై భారం లేకుండానే అద్భుతంగా మెరుగపడతాయని జేపీ అన్నారు. ఈ పని చేయకుండా జబ్బు బాగా ముదిరాక ఖరీదైన వైద్యాన్నందించే ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు ప్రజలు వెళ్లేలా ఆరోగ్యశ్రీ, ఎన్టీఆర్ ఆరోగ్య సేవ వంటివి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అందుకోసం వెచ్చిస్తున్న సుమారు రూ. 2,000కోట్లనే ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేయడానికి వినియోగిస్తే అదనపు భారం కూడా లేకుండానే ప్రజలకు మంచి వైద్యం అందుతుందన్నారు. ప్రైవేటు రంగం సేవలను పారిశుద్ధ్యం, నిర్వహణవంటి వాటికి ఉపయోగించుకోవచ్చని, కానీ వైద్యసేవలు అందించటం మాత్రం పూర్తిగా ప్రభుత్వ బాధ్యతలోనే ఉండాలని జేపీ స్పష్టం చేశారు.

కుంటున్నానని, జాతీయ ఆరోగ్య మిషన్‌ను రూపొందించిన అనుభవం, తాజా సాక్ష్యాలతోనే ఈ పరిష్కారాల్ని చెబుతున్నానని అన్నారు.

ఒక్కో బెడ్ మీద కార్పొరేట్ తరహాలో ప్రభుత్వం ఖర్చు పెట్టనక్కర్లేదని, కనీసం నాలుగు లక్షలను మరో రెండు, మూడు లక్షల మేర పెంచితే రోగులకు మెరుగైన సేవలందించవచ్చని జేపీ అన్నారు. అలాగే డాక్టర్లకు మరీ నాలుగైదు లక్షలు కాకపోయినా, రెండు లక్షలకు తక్కువ కాకుండా ఇవ్వాలన్నారు. ఇదేసమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసి, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి అన్ని కేసులూ ఏరియా ఆస్పత్రి దాకా రాకుండా చూడాలన్నారు. కదిరి ఆస్పత్రిలో రోజుకు వస్తున్న 700-800 మంది పేషెంట్లలో కనీసం రెండొందల మందికి కింది ఆస్పత్రిలోనే వైద్యం చేసేయొచ్చన్నారు. అలాగే వైద్యుల సంఖ్యను పెంచాలన్నారు. కదిరి ఏరియా ఆస్పత్రిలోనే మరో 9మంది వైద్యులు అదనంగా ఉండాలన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్ మధుసూదన్, లోక్‌సత్తా, వైబీఐ నాయకులు పాల్గొన్నారు.

# వ్యవస్థల నిర్మాణమే భరత జాతికి నిజమైన రక్ష



మనది ప్రజాస్వామ్య దేశమని చెప్పుకుంటున్నప్పటికీ.. చట్టం ముందు అందరూ సమానంగా ఉండటం లేదని, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించుకోవడానికి లంచాలివ్వాల్సి వస్తోందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. చీఫ్ సెక్రటరీలుగా రిటైరైన అజేయ్ కల్లాం, ఐవైఆర్ కృష్ణారావు లాంటి వాళ్లు ఇప్పుడు సొంత పని కోసం గవర్నమెంటు ఆఫీసుకెళ్లినా వారిని కూడా లంచం అడుగుతారన్నారు. న్యాయవాదుల మీద పోలీసులకు, వైద్యుల మీద రోగులకు, ప్రజాప్రతినిధులపైన ఓటరుకు, న్యాయమూర్తులకు.. ఇలా ఎవరి మీదా ఎవరికీ నమ్మకం లేని వ్యవస్థ మనదేశంలో తయారైందని, దీన్ని మార్చుకోకపోతే అందరూ తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని అన్నారు. రాజకీయ, న్యాయ, పోలీసు, విద్య, వైద్యం.. ఇలా సమాజంలోని వివిధ వ్యవస్థలు ప్రజలకు నమ్మకముండేలా పనిచేస్తుండాలని, ఫెడరలిజాన్ని విస్తరిస్తూ అధికారాన్ని వికేంద్రీకరించి జనం దగ్గరకు తీసుకెళ్లాలని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి అజేయ్ కల్లాం రాసిన 'వేకప్ కాల్' పుస్తకాన్ని (తెలుగు అనువాదం 'మేలుకొలుపు'తో పాటు) హైదరాబాద్‌లో జేపీ ఆవిష్కరించారు. సీనియర్ పాత్రికేయుడు ఎంవీఆర్ శాస్త్రి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కులం, మతం, పార్టీ, ప్రాంతం సమాజాన్ని నిలువునా చీలుస్తున్నాయని, ఇవే దేశ భవిష్యత్తుకు ఆటంకాలుగా మారుతున్నాయని జేపీ అన్నారు. అధికారం, పేరు కోసం ఉన్మాదం రాజకీయాలను కుదిపేస్తోందన్నారు. ప్రజలు నేతల వ్యక్తిగత ఛరిష్మా చూసి ఓటు వేయడం, వారిపై వ్యతిరేకత రాగానే వేరొకరిని ఎన్నుకోవడమే ప్రజాస్వామ్యం అనుకుంటున్నారన్నారు. గొప్ప నాయకుడిగా మనం భావించి ఎన్నుకున్న నరేంద్రమోదీ సరైన వ్యవస్థల నిర్మాణం చేయకపోవడం వల్లే విఫలమయ్యారని గుర్తించాలన్నారు. రాజకీయ పార్టీల్లో కూడా మంచివాళ్లు, ప్రజలకు ఏదో మంచి చేయాలనే ఉద్దేశంతో వచ్చినవాళ్లు ఉన్నారని, అయితే డబ్బు, అధికార రాజకీయాల్లో కూరుకుపోయి ఆ విషవలయంలో భాగంగా మారిపోయారన్నారు. ఎన్నికల్లో అంత డబ్బును ఖర్చు చేస్తున్నవాళ్లు, ఓట్లను కొనటానికి ఊహించలేనంత డబ్బును వెదజల్లుతున్నవాళ్లు గెలిచాక అంతకు అనేకరెట్లు దండుకోకుండా ఎలా ఉంటారో మనం కూడా ఆత్మసమీక్ష చేసుకోవాలన్నారు. జనజీవనాన్ని మెరుగుపరిచే విషయాలను చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, సరైన బహిరంగ చర్చలు లేకపోవటంతో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోందన్నారు. భారత్‌లాంటి అపనమ్మక దేశం నాగరిక ప్రపంచంలో ఎక్కడా లేదని, జన జీవనానికి, వాళ్ల అవసరాలకు సంబంధించిన అన్ని అంశాలపై చర్చకు పునాది వేసేవాడు ఏ కులానికి, ఏ మతానికి చెందినవాడో తెలుసుకుని.. ఆ కోణంలో ఆలోచించడం సరికాదని అన్నారు. ఆ వ్యక్తి లేవనెత్తిన అంశాలు బహుళ ప్రయోజనంగా ఉన్నాయా, లేదా? అన్నదే చూడాలన్నారు. ఒక వ్యక్తి ద్వారా సమాజానికి జరిగే మేలును బట్టే ఆ వ్యక్తి స్థాయిని అంచనా వేయాలన్నారు. కల్లాం తనకు అప్పగించిన ప్రతి పనినీ, చిత్తశుద్ధితో, వినమ్రంగా పూర్తి చేసేవారని ప్రశంసించారు.

ఒక పార్టీ జెండాపై ఎన్నికై.. వేరే పార్టీ కండువా కప్పుకున్నవారిపై మోసం కేసు నమోదు చేయాలని రిటైర్డ్ జడ్జి జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి అన్నారు. పుస్తకం రాయడానికి గల కారణాలను అజేయ్ కల్లాం వివరిస్తూ, "స్వాతంత్ర్యం రాగానే పుట్టిన తరం మాది. ఎన్నో ఆశలతో ఉత్సాహంగా బాధ్యతలు స్వీకరించిన తమ ఆశల్ని కొత్తతరం నేతలు నీరుగారుస్తూ వ్యవస్థల్ని భ్రష్టు పట్టించారు. అవినీతి, డబ్బుమయ రాజకీయాలు, పతనానికి దగ్గర్లో ఉన్న వ్యవస్థలపై ప్రజల్ని మేలుకొలపాలన్న ఆశే పుస్తకాన్ని రాసేందుకు ఉసిగొల్పింది" అన్నారు. వ్యవస్థలో లోపాలు సరిదిద్దే క్రమంలో 'మనకోసం–మనం' అనే చైతన్య కార్యక్రమాల్ని అనంతపురం నుంచి ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.

69 పేజీల ఈ ఆంగ్ల పుస్తకాన్ని 53 పేజీల్లో తెలుగీకరించి అందుబాటులోకి తెచ్చారు. ఇందులో 12 అంశాలను ప్రస్తావించారు. స్థానిక ప్రభుత్వాల అవగాహన లేని నాయకులు, సినీ నటులు, వ్యాపారవేత్తలు, విద్యాలయాల్లో గ్రూపు రాజకీయాలు చేసిన శక్తులు రాజకీయాల్ని ఎలా భ్రష్టు పట్టించాయో వివరించారు. సాధారణ జీవితం గడుపుతున్న అగ్రరాజ్యాల నేతల్ని, దర్పంతో చెలరేగిపోతున్న మన నేతలతో పోల్చి చూపారు.



IIT / MEDICAL Foundation From 6th Class onwards
Let every child say "Yes, I can"
GITAM INTERNATIONAL SCHOOL TIRUPATI
GITAM SCHOOL
A visionary school for culture and career
Recognised by Govt. of A.P.
Nursery to X Class
ADMISSIONS OPEN 2018-19
Bhavani Nagar Circle, K.T. Road, TIRUPATI. Ph: 0877 - 2225115, 93902 10501
2018 ఇంటర్ ఫలితాలలో గీతమ్ జూనియర్ కాలేజి విద్యార్థులు స్టేట్ 2nd ర్యాంక్ తో పాటు ఇంటర్ మొదటి సం॥లో 72 'A'-Grade, 47 'B'-Grade లు సాధించారు
Jr. Inter లో 10/10 GPA సాధించిన మా విద్యార్థులు
CEC STATE 2nd
966 1000
Admissions OPEN
MPC
E. LALITHA HT No.1809110355
P.V. PRABHATH HT No.1809120623
MPC 983 1000
G.HEMANTH HT No.1809211011
A.S.PRIYA HT No.1809224622
T. DEEPIKA HT No.1809224756
982 1000 MPC
భవానీ నగర్
GITAM EDUCATIONAL INSTITUTIONS TIRUPATI
GITAM JUNIOR COLLEGE
Recongised by BIE - A.P
Courses Offered : • MPC + EAMCET • MPC + IIT (JEE Advance) • BiPC + AIPMT • CEC - MEC + CA-CPT
Bhavani Nagar Circle, K.T. Road, TIRUPATI - 1. Ph : 0877 - 2225115, 9390210502, 9885012182
It's Raining of CAMPUS SELECTIONS @ GATE
SC, ST, BC & OC విద్యార్థులకు ఉచితం*
GATE EDUCATIONAL INSTITUTIONS TIRUPATI
Dr. T. Venkateswarlu
Correspondent
DEGREE COURSES B.Sc., | B.Com
PG COURSES M.Sc., | M.Com
GATE DEGREE & PG COLLEGE
(Affiliated to S.V.University)
జాబ్ గ్యారంటీ ప్రొఫెషనల్ కోర్సులు
B.C.A B.B.A M.B.A D.Ed
భవానీ నగర్ సర్కిల్, తిరుపతి. ఫోన్ : 0877 - 2286423, సెల్ : 99632 59463, 9440074119, 9989294144









# రోజువారీ, స్థానిక సమస్యల మీద పనిచేయండి, సోషల్ మీడియాలో బహిరంగ చర్చ ప్రమాణాల్ని పెంచండి

మనదేశంలో ఎంతో పేదరికం, అవిద్య, ఎన్నో సంక్లిష్టతలు ఉన్నా సమాజంలో అంతర్గతంగా మంచి ఉందని.... అందుకే చాలా దేశాల్లో కంటే మనం కొంత భద్రతతో స్వేచ్ఛగా బతకగలుగుతున్నామని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సమాజంలోని ఈ మంచిని పరిరక్షించుకునే పనిని యువత చేపట్టాలన్నారు. అలాగే... జాతి, జెండా, రక్తం చిందించటం వంటి పెద్ద మాటల దాకా వెళ్లకుండానే మన రోజువారీ జీవితాల్లో చేయాల్సిన చాలా పనులున్నాయన్నారు. అలాంటి వాటి మీద దృష్టి పెట్టి అవగాహనతో, చట్టబద్ధమైన తెలివితో పనిచేస్తుండటం వల్లే షీలా రాజ్, శివ వంటి యువత కొన్ని మంచి పరిష్కారాల్ని సాధిస్తున్నారన్నారు. లైబ్రరీల కోసం వసూలు చేసిన సెస్సుల్ని లైబ్రరీలకే ఖర్చు చేయాలని షీలా రాజ్ చేసిన ప్రయత్నం ఫలితాన్నిచ్చిందని, దీర్ఘకాలికంగా ఇంకా చాలా చేయాల్సున్నా మార్పయితే మొదలైందని అన్నారు. అలాగే జీహెచ్ఎంసీలో దోసపాటి రాము అందరికీ తెలిసిన ప్లాస్టిక్ కాలుష్యం మీదే పనిచేస్తూ సింపుల్‌గానే ప్రభావం చూపగలుగుతున్నారన్నారు. రోజువారీ సమస్యల పరిష్కారానికి యువత ప్రాధాన్యతనిస్తే అద్భుతాలు వాటంతటవే జరుగుతాయన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో జేపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మనం చేజేతులారా అవకాశాల్ని జారవిడవటంతో... దేశవ్యాప్తంగా మరో ఇరవై, పాతికేళ్లదాకా మార్పు వచ్చే అవకాశం ఇప్పటికైతే కనిపించటం లేదని ఆయన ఈ సందర్భంగా అన్నారు. జనామోదం, నిజాయతీ, కష్టపడేతత్వం ఉన్న మోదీ కూడా గత పాలకుల్లాగానే పాలిస్తుండటంతో ఓ గొప్ప అవకాశం జారిపోయిందన్నారు. భారత్ వంటి సువిశాల సంక్లిష్ట దేశంలో ఇలాంటి అవకాశాలు ఎప్పుడోగానీ రావన్నారు. అయితే నిరాశపడకుండా, దేశవ్యాప్తంగా కాకున్నా, రాష్ట్రాలు, జిల్లాలు, నగరాల స్థాయిలో మార్పులు తెచ్చేందుకు స్థానికంగా యువత ఎక్కడికక్కడ వీలైనంత కృషి చేస్తూ వుంటే క్రమంగా మార్పు అవకాశాలు పెరుగుతాయన్నారు. సోషల్ మీడియాలో బహిరంగ చర్చ ప్రమాణాలు దారుణంగా ఉన్నాయని, ఎలిమెంటరీ కామన్‌సెన్స్, కనీస విషయ పరిజ్ఞానం కూడా లేకుండా ఒకరినొకరు బూతులు తిట్టుకుంటున్నారని జేపీ అన్నారు. తెలంగాణ గురించి మాట్లాడితే కేసీఆర్‌కు మద్దతిచ్చినట్లని, ఏపీ గురించి మాట్లాడితే చంద్రబాబుతో ఏదో ఉందని, దేశం గురించి మాట్లాడితే నరేంద్ర మోదీ మనిషని, మంచీచెడు విచక్షణలేకుండా అందరినీ, అన్ని పనుల్నీ విమర్శిస్తుంటే ప్రజల పక్షమని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారన్నారు. దేశమంటే నరేంద్ర మోదీయో, ఆయన తర్వాతి ప్రధానమంత్రో కాదన్నారు. సీఎంలు, పీఎంలు మారినా రాష్ట్రాల్లో, దేశంలో ప్రజలు, వారి ప్రయోజనాలు శాశ్వతమనే ఇంగితజ్ఞానం ఉండాలన్నారు. ప్రభుత్వానికి-పార్టీలకి మధ్య ఉన్న తేడా, ప్రజలకు-పాలకుల మధ్య ఉన్న సంబంధం వంటి విషయాల్ని అర్థమయ్యేలా వివరిస్తూ, కనీస పరిజ్ఞానంతో చర్చలు చేస్తూ బహిరంగ చర్చ ప్రమాణాల్ని, ముఖ్యంగా సోషల్‌మీడియాలో పెంచాలని వైబీఐ యువతీయువకులకు జేపీ సూచించారు.

Posting Date 07-05-2018

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on May 1st, 2018










# 'కులరహిత భారత్' కోసం పరుగు

ఆఫ్రికా నుంచి మానవజాతి ఉనికి ప్రారంభమయ్యాక 74,000 ఏళ్ల క్రితం ఇండోనేషియా సుమత్రా దీవిలోని మౌంట్ టోబా వద్ద జరిగిన అగ్నిపర్వత విస్ఫోటనంలో చాలావరకు మానవాళి నశించిపోయిందని, ఆ తరుణంలో నేటి కర్నూలు జిల్లా జ్వాలాపురంలో బతికిబట్టకట్టిన చిన్న తెగవారే ప్రపంచదేశాలకు వందలాదిగా వలస వెళ్లి మానవజాతి ఉనికిని నిలబెట్టారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు. ఆఫ్రికాలో ఒకే మూలం నుంచి వచ్చిన మనం... కులం, మతం పేరుతో కొట్టుకోవడం మూర్ఖత్వమన్నారు. యువత ఇంగితజ్ఞానంతో ఆలోచించి తమకు నిజంగా మేలు చేసే నిర్ణయాలను తీసుకోవాలని, కులాలకతీతంగా మనసుకు నచ్చిన వారిని వివాహం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డా॥ అంబేద్కర్ జన్మదినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో జరిగిన 'రన్ ఫర్ క్యాస్ట్‌ఫ్రీ ఇండియా'లో జేపీ పాల్గొన్నారు. దళిత్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (డిక్కీ), ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి, డిక్కీ సౌతిండియా అధ్యక్షుడు నర్రా రవికుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ కిరణ్, త్రిపురనేని వరప్రసాద్, గిన్నిస్ విజేత క్రీడాకారిణి షేక్ సమీరా తదితరులు పాల్గొన్నారు.

Book-Post

PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times

Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad